మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి
# ఈవార్తలు
దినపత్రిక
NETI EVARTHALU

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 16-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 167 Issue: 167

Published from Jagitial
www.evarthalu.com

16 డిసెంబర్ 2025 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:42 సూర్యాస్తమయం - సా. 5:40 తిథిః ద్వాదశి రా. 11:57 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం స్వాతి మ. 2:03 వరకు తరువాత విశాఖ యోగం అతిగండ మ. 1:20 వరకు కరణం కౌలవ ఉ. 10:38 వరకు తైతుల రా. 11:57 వరకు వర్జ్యం రా. 8:27 నుండి రా. 10:15 వరకు దుర్ముహూర్తం ఉ. 8:54 నుండి ఉ. 9:38 వరకు రా. 10:53 నుండి రా. 11:45 వరకు రాహుకాలం మ. 2:56 నుండి సా. 4:18 వరకు యమగండం ఉ. 9:27 నుండి ఉ. 10:49 వరకు గుళికాకాలం మ. 12:11 నుండి మ. 1:34 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:06 నుండి తె. 5:54 వరకు అమృత ఘడియలు లేదుజ అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:33 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

## మళ్లీ వస్తా.. మ్యాచ్ ఆడతా

### మీ అభిమానానికి కృతజ్ఞుడిని... ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీ



భారత్‌లో పర్యటిస్తున్న ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ, అతడి బృందం అభిమానుల ప్రేమకు పులకించిపోయారు. 'గోట్ ఇండియా టూర్ 2025'లో భారత్‌లో అడుగుపెట్టిన మెస్సీ టీమ్‌కు అడుగడుగనా జననీరాజనం లభించింది. మూడో రోజు ఢిల్లీలో అపూర్వ స్వాగతం అనంతరం అరుణ్ జైట్లీ స్టేడియంలో ఫ్యాన్స్‌ను అలరించాడు మెస్సీ. టీ20 ప్రపంచకప్ టికెట్ విడుదల చేసిన తర్వాత.. భారీగా తరలివచ్చిన అభిమానలను ఉద్దేశించి ఫుట్‌బాల్ ఐకాన్ మాట్లాడాడు.

న్యూఢిల్లీ: తాము మరోసారి భారత్‌కు వస్తామని, అప్పుడు కచ్చి తంగా మ్యాచ్ ఆడుతామని మాటి చ్చాడీ సాకర్ లెజెండ్. అరుణ్ జైట్లీ స్టేడియంలో అభిమానులకు అభివాదం తర్వాత మెస్సీ మైక్ తరువాయి 2 వ పేజీలో...

## స్క్వాష్.. టీమిండియా క్యాచ్!

### ప్రపంచకప్ టైటిల్ మనదే.. 3-0తో హాంకాంగ్‌పై గెలుపు



భారత స్క్వాష్ మిక్స్‌డ్ టీమ్ చరిత్ర సృష్టించింది. తొలి ప్రపంచకప్ టైటిల్‌ను ముద్దాడింది. ఆదివారం చెన్నై వేదికగా జరిగిన ఫైనల్లో భారత్ 3-0తో టాప్ సీడ్ హాంకాంగ్‌ను ఓడించి విశ్వవిజేతగా నిలిచింది. స్క్వాష్ ప్రపంచకప్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా చరిత్రకెక్కింది. 2023లో కాంస్యం నెగ్గిన తర్వాత స్క్వాష్ క్రీడలో టీమిండియాకు ఇదే అత్యుత్తమ ప్రదర్శన.

## మార్చి 26న ఐపీఎల్ షురూ!



- తొలుత మార్చి 15గా ప్రకటన.. తాజాగా మార్పు
- మే 31తో ముగియనున్న టీ20 సంబురం
- నేడు అబుదాబీలో ఐపీఎల్ మినీ ఆక్షన్



## వారానికి 4 రోజులే పని.. కానీ!

- 48 గంటల పని చేయాల్సిందే
- రోజుకు అత్యధికంగా 12 గంటలు
- కొత్త లేబర్ కోడ్స్‌పై కేంద్రం క్లారిటీ

వారానికి 4 రోజుల పని విధానంపై కేంద్ర కార్మిక శాఖ క్లారిటీ ఇచ్చింది. కొత్త లేబర్ కోడ్స్ ప్రకారం 4 రోజుల పని విధానం సాధ్యమేనని తెలిపింది. అయితే ఇందుకు కొన్ని నిబంధనలు వర్తిస్తాయి.

న్యూఢిల్లీ: వారానికి మొత్తం పని గంటలు 48 గంటలు మించకూడదు. అంటే ఉద్యోగులు 4 రోజులు పనిచేస్తే, రోజుకు గరిష్ఠంగా 12 గంటలు పని చేయవచ్చు. మిగిలిన 3 రోజులు పెయిడ్ సెలువులుగా ఉంటాయి. అయితే రోజుకు 12 గంటల పని అనగానే -2 వ పేజీలో...

# కేబినెట్ క్లీనింగ్!

### మంత్రివర్గ ప్రక్షాళనపై కాంగ్రెస్ దృష్టి?
### నిజమేనని క్లారిటీ ఇచ్చిన టీపీసీసీ చీఫ్
### ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో వెల్లడి



తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో త్వరలోనే భారీ ప్రక్షాళన ఉండబోతోందా? అంటే.. అవునన్నారు టీపీసీసీ చీఫ్. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం ఈ దిశగా ఇప్పటికే కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం అందగా, దానిపై మహేశ్ కుమార్ గౌడ్ క్లారిటీ ఇవ్వలేదు. 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. ఇటీవలే రెండేళ్ల పాలనను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో కేబినెట్‌లో మార్పులు చేయబోతున్నారని గత కొంతకాలంగా వార్తలు గుప్పుమన్నాయి.

న్యూఢిల్లీ/హైదరాబాద్: ఆ వార్తలు నిజమేనని కన్ఫర్మ్ చేశారు టీపీసీసీ చీఫ్. ప్రస్తుతం చాలా మంది మంత్రులపై కంప్లెయింట్లు ఉన్నాయి. కొందరు మంత్రుల పనితీరుపై సీఎం రేవంత్ అసహనంతో ఉన్నట్లు తెలిసింది. మరోవైపు, కొందరు అమాత్యులు తమ నోటిదురుసుతనంతో పార్టీకి, ప్రభుత్వానికి చేటు చేసేలా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత మంత్రుల్లో కొందరి శాఖలను తరువాయి 2 వ పేజీలో...



# జిల్లాకో లీగల్ సెల్

### కొత్త సర్పంచ్‌లకు అండగా ఉంటాం
### అరగంటలో అందుబాటులో యంత్రాంగం
### కాంగ్రెస్ బెదిరింపులకు భయపడవద్దు
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని, వారి రక్షణ కోసం ప్రతి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి గెలుపొందిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

సిరిసిల్ల, డిసెంబర్ 15 (ఈవార్తలు): ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులను అభినందిస్తూ, వారికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని కేటీఆర్ భరోసా ఇచ్చారు. "మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులు గానీ, పాలకపక్ష నేతలు గానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకండి. వెంటనే పార్టీని సంప్రదించండి. మీ కోసం ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. అరగంటలో పార్టీ యంత్రాంగం మీకు అండగా నిలుస్తుంది, కోర్టు ద్వారా మన హక్కుల కోసం కొట్లాడుదాం" అని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు రావాల్సిన ఫైనాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరని, ఆ నిధులు సాధించుకునే బాధ్యత తాము తరువాయి 2 వ పేజీలో...

## పల్లె పల్లెకు జాగృతి



### 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం
### ఉచిత విద్య, వైద్యం నా లక్ష్యం
### సామాజిక తెలంగాణ నా పథం
### కల్వకుంట్ల కవిత స్పష్టీకరణ

2029 ఎన్నికల్లో పోటీ చేయబోతున్నట్లు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఎక్స్ వేదికగా ఆస్క్ కవిత పేరుతో క్వశ్చన్ అవర్ నిర్వహించిన సందర్భంగా కవిత ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో "మీ కొత్త పార్టీ పేరు ఏంటి?" అని ఓ నెటిజన్ అడగగా.. ఆ పేరు ఎలా ఉండాలో చెప్పాలంటూ కవిత బదులిచ్చారు.

హైదరాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): భారత్ వందో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2047 నాటికి మీ విజన్, మిషన్ ఏంటి అని నెటిజన్ అడిగాడు. దీనికి బదులిస్తూ.. నాణ్యమైన ఉచిత విద్య, నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే తన విజన్, తన మిషన్ అని కవిత పేర్కొన్నారు. ఇక తెలంగాణ జాగృతి కార్యక్రమాలు నగరాలకే ఎందుకు పరిమితమయ్యాయని అడిగిన ప్రశ్నకు.. త్వరలో జాగృతిని గ్రామాలకు విస్తరిస్తానని కల్వకుంట్ల కవిత చెప్పారు. ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తమిళనాడులో జయలలిత ఎలా స్వతంత్ర నాయకత్వంతో ప్రజల విశ్వాసం సంపాదించారో, అలాగే మీరు కూడా ముఖ్యమంత్రి అయితే ప్రజలకు అంకితమైన బలమైన నాయకత్వం అందిస్తారని ఆశిస్తున్నామని అన్న ఓ నెటిజన్ పోస్టుకు సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్ ఈస్ట్ ప్రాంతాన్ని ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవట్లేదు, పశ్చిమ ప్రాంతం పైనే పెట్టుబడులు, మౌలిక తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,391 |
| వెండి (గ్రాము): | రూ.210 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,071 |

## విశ్వవాణి



ఫిలిప్పీన్స్‌కు చెందిన ఓ విద్యార్థి.. తన గ్రాడ్యుయేషన్ డే రోజున తల్లి కటౌట్‌తో వేదికపై దర్శనమిచ్చాడు. కొడుకు డిగ్రీ పూర్తయిన సందర్భాన్ని చూడాలని కలలుగన్న ఆమె నిమోనియా సమస్యలతో చనిపోయింది. దీంతో తన తల్లి కోరిక మేరకు డిగ్రీ చేసిన పాలో జాన్ అలిన్ సాగ్.. డిగ్రీ పట్టాను తల్లి ఫొటోతో కలిసి అందుకున్నాడు.

## దేవుడికి రెస్ట్ ఇవ్వరా?

### విశ్రాంతి సమయంలో ప్రత్యేక పూజలా?
### మధుర దర్శన సమయాల మార్పుపై సుప్రీం



ఉత్తరప్రదేశ్‌లోని మధుర బాంకీ బిహారీజీ మహారాజ్ ఆలయంలో దర్శన సమయాల మార్పుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. దేవుడికి విశ్రాంతి సమయంలో ప్రత్యేక పూజలు చేయడమేమిటని ప్రశ్నించింది. ఇక్కడి ఆలయం దర్శన వేళలు, పూజా విధానాల్లో మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం భక్తుల నుంచి డబ్బులు తీసుకుని ప్రత్యేక పూజలు చేయడాన్ని తప్పుబట్టింది.

న్యూఢిల్లీ: దేవుని విశ్రాంతి వేళల్లో ప్రత్యేక పూజలు చేయడం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. ఈ కేసులో దర్యాప్తునకు ఉన్నత స్థాయి ఆలయ నిర్వహణ కమిటీని నియమించింది. బాంకీ బీహారీజీ ఆలయంలో దర్శన వేళల్లోనే కాకుండా పలు మతపరమైన పూజా విధానాల్లోనూ మార్పులు చేస్తున్నట్లు పిటిషనర్ల -2 వ పేజీలో...

# 60 ఆలయాల్లో యూపీఐ పేమెంట్స్

### భక్తుల కోసం టీటీడీ మరో కీలక నిర్ణయం

తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. టీటీడీ స్థానికాలయాల్లో యూపీఐ చెల్లింపులకు కియోస్క్ మిషన్లు, క్యూఆర్ కోడ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆదేశించారు. ఈ మేరకు తిరుమల తరహాలో తిరుచానూరు, గోవిందరాజ స్వామి ఆలయాల్లో భక్తుల నుండి అభిప్రాయ సేకరణ చేపట్టారు.



తిరుమల, డిసెంబర్ 15 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా ఉన్న 60 టీటీడీ ఆలయాల్లో భక్తులు సులభతరంగా యూపీఐ పేమెంట్లు చేసేందుకు వీలుగా కియోస్క్ మిషన్లు, క్యూఆర్ కోడ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గల ఆయన కార్యాలయంలో సోమవారం ఉదయం ఈవో సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో టీటీడీ నిర్మించదలచిన ఐదువేల ఆలయాలకు గాను అవసరమైన రెండు, మూడు డిజైన్లు సిద్ధం చేయాలని సీఈని ఆదేశించారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణ ప్రక్రియ వేగవంతమవుతుందని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తరువాయి 2 వ పేజీలో...

ఈవార్తలు



# రాశి ఫలాలు

16.12.2025

మేషం: ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులలో జాప్యం కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. దూరప్రయాణాలు వీలైనంత వాయిదా వేయుట మంచిది. మీ ఆలోచనలు కుటుంబ సభ్యులకు నచ్చే విధంగా ఉండవు.

వృషభం: సంతాన ఉద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణప్రయత్నాలు చేయవలసి వస్తుంది. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి.

మిధునం: వ్యాపార ఉద్యోగాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. జీవిత భాగస్వామితో సఖ్యతగా వ్యవహరిస్తారు. నిరుద్యోగయత్నాలు సానుకూలమవుతాయి. భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. సమాజంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ పొందుతారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి.

కర్కాటకం: ధన వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ముఖ్యమైన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపిస్తుంది. వ్యాపార ఉద్యోగాలలో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. చేపట్టిన వ్యవహారాలు సజావుగా పూర్తి చేస్తారు. స్నేహితులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

సింహం: కుటుంబ సభ్యుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. దీర్ఘకాలిక రుణాలు ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో సొంత నిర్ణయాలు కలిసిరావు.

కన్య: ఉద్యోగస్తులకు అధికారుల నుండి సమస్యలు తప్పవు. ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ వాతావరణం గంధరగోళంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి.

తుల: నిరుద్యోగులకు నూతన ఉద్యోగయోగం ఉన్నది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో ఉన్న వివాదాలు పరిష్కారమవుతాయి. ఆత్మీయుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు.

వృశ్చికం: గృహమున కొన్ని సంఘటనలు ఆశ్చర్యం కలిగిస్తాయి. చిన్ననాటి మిత్రులతో మాట పట్టింపులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగస్తులకు ఇతరుల నుండి విమర్శలు తప్పవు. కుటుంబ విషయాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. దైవ సేవా కార్యక్రమాలకు ధనసహాయం అందిస్తారు.

ధనస్సు: విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. చాలా కాలంగా పూర్తికానీ పనులు చిన్న ప్రయత్నంతో పూర్తి చేస్తారు. రావలసిన సొమ్ము సకాలంలో చేతికందుతుంది. వ్యాపార ఉద్యోగాలలో అంచనాలు నిజమవుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాల్లో పాల్గొంటారు.

మకరం: సంతానం విద్యా విషయాలలో నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో ఊహించని మార్పులు తప్పవు. ఆర్థిక వ్యవహారాలలో అప్రమత్తంగా ఉండాలి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి.

కుంభం: చిన్ననాటి మిత్రులతో విందువినోదాలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సంతాన వివాహ విషయమై గృహమును ప్రస్తావన వస్తుంది. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

మీనం: చేపట్టిన పనులలో యత్న కార్యసిద్ధి కలుగుతుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలలో భాగస్తులు నుండి ఆశించిన సహాయం అందుతుంది. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. స్నేహితులతో వివాదాలు పరిష్కారమవుతాయి.

# కేబినెట్ క్లీనింగ్!

మొదటి పేజీ తరువాయి

మార్చడం లేదా వారికి ఇతర కీలక బాధ్యతలు అప్పగించడం వంటి చర్యలు ఉండే అవకాశం ఉంది.పార్టీలో సీనియర్లు, సమర్థవంతమైన నాయకులు, అలాగే సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని కొత్తవారికి మంత్రివర్గంలో చోటు కల్పించే దిశగా సీఎం ఆలోచిస్తున్నట్లు సమాచారం.ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపరచడం, రాబోయే రోజుల్లో ప్రజల్లోకి మరింతగా చేరుకోవడం లక్ష్యంగా ఈ ప్రక్షాళన జరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### రేవంత్-అధిష్ఠానం ఏకాభిప్రాయం రావాలి: టీపీసీసీ చీఫ్

త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గ ప్రక్షాళన ఉంటుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. శాఖలే మారుస్తారా? లేదంటే.. మంత్రులనే మారుస్తారా? అనే విషయంలో మాత్రం తనకు స్పష్టత లేదన్నారు. అయితే, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధిష్టానం మధ్య ఏకాభిప్రాయం కుదరాల్సి ఉందని చెప్పారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, కార్యదర్శులతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిటీలను నెలరోజుల్లో భర్తీ చేస్తామన్నారు. మంత్రివర్గం నుంచి పొన్నం ప్రభాకర్, సురేఖను తొలగిస్తారనే ప్రచారంలో వాస్తవం లేదని, వాళ్లిద్దరూ కాంగ్రెస్ నేతలే అని వ్యాఖ్యానించారు. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన 'ఓట్ చోర్%-%గద్దీ ఛోడ్'మహాధర్నాలో పాల్గొనేందుకు మహేశ్ గౌడ్ వచ్చారు. ఈసందర్భంగా ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు సమయంలోనే నన్ను మంత్రివర్గంలోకి ఆహ్వానించారు. స్వయంగా కేసీ వేణుగోపాల్ ప్రతిపాదన పెట్టారు. కానీ, నాకు మంత్రి పదవిపై మక్కువ లేదని చెప్పాను. గ్లోబల్ సమ్మిట్‌లో రాజకీయ ప్రాధాన్యత ఉండొద్దనే ఉద్దేశంతోనే మంత్రులను స్టేజీ మీదకు ఆహ్వానించలేదు. అయితే, మంత్రులను కూడా వేదికపైకి పిలిస్తే బాగుండేది. కొందరు ఐఏఎస్ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాహుల్ గాంధీ గ్లోబల్ సమ్మిట్‌కు కూడా వస్తే బాగుండేది. గ్లోబల్ సమ్మిట్ ప్రతిఏటా పెడితే ఎలా ఉంటుందనేది ఆలోచిస్తున్నాం. బీసీ ప్రైవేట్ బిల్లు పార్లమెంటులో పెడితే బాగుంటుందని రాహుల్ గాంధీకి చెప్పాం. డీసీసీ అధ్యక్షుల ఎంపిక పారదర్శకంగా జరిగింది. రంగారెడ్డి, సంగారెడ్డి డీసీసీ పదవులనూ తొలివిడతలోనే భర్తీ చేయాలి. కానీ, అక్కడ వచ్చిన దరఖాస్తులు, క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోలలేదు. అందుకే ఆ రెండింటిని పెండింగ్‌లో ఉంచాం. బీఆర్ఎస్ కథ ముగిసిపోయింది. పదేళ్ల బీఆర్ఎస్ అవినీతిని కవిత దగ్గర నుంచి చూసింది కాబట్టే.. ఆమె మాటలను ప్రజలు అంగీకరిస్తున్నారు. ప్రాంతీయ పార్టీలు అధికారంలో లేకుండా మనుగడ సాధించడం అంత సులభం కాదు. కేసీఆర్ ఇమేజ్ కేటీఆర్‌కు రాలేదు. హరీశ్‌రావు దెబ్బకొట్టడం ఖాయం. డబ్బులతో కేటీఆర్ సోషల్ మీడియాను మేనేజ్ చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఏం జరుగుతుందో కేసీఆర్ ముందే ఊహించారు.. అందుకే ప్రచారానికి రాలేదు. బీజేపీకి అనుకూలమైన వాతావరణం తెలంగాణలో ఏమాత్రం లేదు. బీజేపీ అధిష్టానానికీ ఆ విషయం తెలుసు. బీజేపీకి 60%-%70 స్థానాల్లో కనీసం కేడరే లేదు. బీజేపీ ఎమ్మెల్యేలు పక్కచూపులు చూస్తు న్నారు. కానీ మేమే కొన్ని విలువలు పాటిస్తున్నాం. కాబట్టే.. అవకాశం ఇవ్వడం లేదు. మళ్లీ ప్రభుత్వం రావడం అనేది మాకు నల్లేరు మీద నడకే. రేవంత్ రెడ్డి విజనరీ ఉన్న లీడర్. ఫోర్త్ సిటీ పూర్తయితే దేశంలోని మరే నగరం హైదరాబాద్‌తో తట్టుకోలేదు. కంపెనీలకు అన్ని రకాలుగా అనుకూలమైన పాలసీలు రూపొందించాం. టెస్లాను హైదరాబాద్‌కు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ విషయంలో సహకరించాలని రాహుల్ గాంధీని కోరాం. చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఇన్వెస్టర్లు మాత్రం హైదరాబాద్ వైపే చూస్తున్నారు. హైదరాబాద్‌లోని ఏ పెద్ద వెంచర్‌లోకి వెళ్లినా పుణే, చెన్నై, ముంబై, బెంగళూరుకు చెందిన వాళ్లే కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువశాతం వెంచర్లలో 25 నుంచి 30 శాతం మహారాష్ట్ర వాళ్లే కొనుగోలు చేస్తున్నారు. రాబోయే మూడేళ్లలో హైదరాబాద్ ఇండియాలోనే నంబర్ వన్ నగరంగా మారబోతోంది' అని పేర్కొన్నారు.



# మళ్లీ వస్తా..

మొదటి పేజీ తరువాయి

అందుకున్నాడు. ఈ మూడు రోజులు భారత పర్యటనలో తమకు లభించిన స్వాగత సత్కారాలకు ఫిదా అయిపోయామని చెప్పాడతడు. 'గోట్ ఇండియా టూర్ 2025లో భాగంగా వచ్చిన మా బృందానిపై మీరు చూపిన ప్రేమ, అభిమానానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా. మీ అందరిని కలవడం నాకు మర్చిపోలేని అనుభవం. మా పర్యటన తక్కువ రోజులే అయినప్పటికీ.. వేగంగా పూర్తైనప్పటికీ, మీ నుంచి అంతులేని ప్రేమ మాకు లభించింది. నాపై మీకు ఎనలేని అభిమానం ఉందని తెలుసు. కానీ.. ప్రత్యక్షంగా చూడడం చాలా గొప్పగా అనిపించింది. గోట్ ఇండియా టూర్ 2025లో భారతీయులు మాకు స్వాగతం పలికిన తీరు.. మాకోసం స్టేడియాలకు పోటెత్తడం చాలా క్రేజీగా తోచింది. మీరు చూపించిన ప్రేమను మా వెంట తీసుకెళు_న్నాం. మేము కచ్చితంగా తిరిగొస్తాం. ఏదో ఒకరోజు.. ఏదో ఒక సందర్భంలో మీకోసం మ్యాచ్ ఆడుతాం. మరోసారి చెబుతున్నా.. మేము తప్పనిసరిగా భారత్‌కు మళ్లీ వస్తాం. అందరికీ కృతజ్ఞతలు' అని మెస్సీ ఒకింత ఉద్వేగంగా మాట్లాడాడు.

# వారానికి 4 రోజులే పని.. కానీ!

మొదటి పేజీ తరువాయి

నిరంతరం 12 గంటలు డెస్క్ వద్దే కూర్చోవాల్సిన అవసరం లేదని కార్మిక శాఖ వివరించింది. ఇందులో విరామాలు, బ్రేకులు కూడా కలిసే లెక్కిస్తారు. అయితే ఒక రోజులో 12 గంటలకు మించి పనిచేస్తే మాత్రం అదనపు గంటలకు డబుల్ వేతనం చెల్లించాల్సి ఉంటుంది. 2025 నవంబర్ 21 నుంచి ప్రభుత్వం 29 పాత కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు కొత్త లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. అందులో వేతనాల కోడ్ 2019, ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ 2020, సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020, ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ 2020 లు ఉన్నాయి. ఈ చట్టాల ఉద్దేశ్యం సమయానికి వేతనాలు, స్థిరమైన పని గంటలు, మెరుగైన భద్రత, ఆరోగ్య సదుపాయాలు కల్పించడమే. కొత్త లేబర్ కోడ్స్ ప్రకారం ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు కూడా పర్మనెంట్ ఉద్యోగులతో సమానమైన లీవులు, ఆరోగ్య భీమా, సామాజిక భద్రత లభిస్తుంది. ఇక గ్రాట్యుటీ విషయానికి వస్తే, ఇప్పటివరకు 5 సంవత్సరాల సేవ అవసరమైతే, ఇప్పుడు కేవలం ఒక సంవత్సరం నిరంతర సేవతోనే అర్హత కలుగుతుంది. అదేవిధంగా తొలిసారిగా గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫామ్ వర్కర్లు, అగ్రిగేటర్ వర్కర్లను అధికారికంగా గుర్తించారు. ఆధార్‌తో లింక్ చేసిన యూనివర్సల్ అకౌంట్ నంబర్ ద్వారా వారి సంక్షేమ నిధులు పోర్టబుల్‌గా మారాయి. ఈ మార్పులన్నింటిని పరిశీలిస్తే.. భారత్‌లో కూడా భవిష్యత్తులో 4 రోజుల పని విధానం అమలులోకి వచ్చే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# స్క్వాష్.. టీమిండియా క్యాచ్!

**ప్రపంచకప్ టైటిల్ మనదే.. 3-0తో హాంకాంగ్‌పై గెలుపు**

భారత స్క్వాష్ మిక్స్‌డ్ టీమ్ చరిత్ర సృష్టించింది. తొలి ప్రపంచకప్ టైటిల్‌ను ముద్దాడింది. ఆదివారం చెన్నై వేదికగా జరిగిన ఫైనల్లో భారత్ 3-0తో టాప్ సీడ్ హాంకాంగ్‌ను ఓడించి విశ్వవిజేతగా నిలిచింది. స్క్వాష్ ప్రపంచకప్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా చరిత్రకెక్కింది. 2023లో కాంస్యం నెగ్గిన తర్వాత స్క్వాష్ క్రీడలో టీమిండియాకు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. టోర్నీ మొత్తం ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు ఓటమెరుగని జట్టుగా ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఈజిప్ట్ తర్వాత ఈ టైటిల్ నెగ్గిన జట్టుగా టీమిండియా నిలిచింది. ఫైనల్లో సీనియర్ ప్లేయర్ జోష్న చినప్ప, అభయ్ సింగ్, 17 ఏళ్ల సెన్సేషన్ అనాహత్ సింగ్ కళ్లు చెదిరే ప్రదర్శనతో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. ఫైనల్లో ముందుగా పురుషుల సింగిల్స్ మ్యాచ్ జరగ్గా అభయ్ సింగ్ 3-0 (7-1, 7-4, 7-4)తో హాంగ్ కాంగ్ అలెక్స్ లౌను ఓడించాడు. వరుసగా మూడు సెట్లను కైవసం చేసుకున్నాడు. ఆ తర్వాత జరిగిన మహిళల సింగిల్స్ 1లో 17 ఏళ్ల అనహత్ సింగ్ 3-0 (7-2, 7-2, 7-5)తేడాతో టొమాటో హెూను ఓడించింది. మహిళల సింగిల్స్ రెండో మ్యాచ్‌లో జోష్న చినప్ప 3-1(7-3, 2-7, 7-5, 7-1) తేడాతో తన కంటే మెరుగైన ర్యాంక్ కలిగిన కాయిలీని ఓడించింది. ఈ అద్భుత ప్రదర్శనతోస్వర్ణ పతకాన్ని ఖాయం చేసింది. క్వార్టర్ ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాపై 3-0తో విజయ సాధించిన భారత్.. సెమీ-ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ ఈజిప్ట్‌ను కూడా 3-0 తేడాతో మట్టికరిపించింది.

# దేవుడికి రెస్ట్ ఇవ్వరా?

మొదటి పేజీ తరువాయి

తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, న్యాయవాది తన్వి దూబే అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం దేవుడికి విశ్రాంతి వేళలు ఉంటాయని, కానీ ఆ సమయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆలయ కమిటీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దేవుడికి విశ్రాంతినివ్వకుండా ప్రత్యేక పూజలు చేయడమేమిటని ప్రశ్నించింది. అనాదిగా వస్తున్న నియమాలను, పద్ధతులను, దర్శన సమయాలను పాటించాలని ఆదేశించింది. అనంతరం కేసు విచారణను జనవరి మొదటి వారానికి వాయిదా వేసింది.

# 60 ఆలయాల్లో యూపీఐ పేమెంట్స్

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. తిరుపతిలోని వినాయక నగర్ వద్ద ఉన్న టీటీడీ స్టాఫ్ క్వార్టర్స్ ఆధునీకరణ పనులను త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటు పనులను కూడా వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. అప్పలాయగుంట ఆలయం వద్ద భక్తులకు సమాచారం తెలిసేలా సమాచార సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శ్రీవారి ఆలయంలో ఉన్న కదిలే వంతెన మరమ్మతు పనులను వైకుంఠ ఏకాదశిలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముంబైలోని బాంద్రా ఆలయంలో జేఈవో, చీఫ్ ఇంజనీర్,సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

### బెలగావిలో ఆలయ నిర్మాణం

స్థానికాలయాలకు నియమించిన ప్రత్యేక అధికారులు ఆయా ఆలయాల అభివృద్ధికి సంబంధిత అధికారుల తో సమన్వయం చేసుకుని సత్వర చర్యలు చేపట్టాల్సిందిగా సింఘాల్ ఆదేశించారు. తిరుమల తరహాలో తిరుచానూరు, తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో కూడా టీటీడీ అందిస్తున్న సేవలపై భక్తుల నుండి అభిప్రాయ సేకరణ చేయాలని చెప్పారు. కర్ణాటకలోని బెలగావిలో ఆలయం నిర్మాణం, బీహార్ లోని పాట్నాలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయింపుపై ఆయా అధికారులతో సంప్రదించి ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు.

# పల్లె పల్లెకు జాగృతి

మొదటి పేజీ తరువాయి

సదుపాయాలు ఎందుకు తీసుకెళ్తున్నారు?

సర్వతోముఖాభివృద్ధి, సమానమైన అభివృద్ధి అనేది ఏ ప్రభుత్వానికైనా ప్రధాన లక్ష్యంగా ఉండాలి. హైదరాబాద్ తూర్పు ప్రాంతానికి తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే విషయంతో నేను ఏకీభవిస్తున్నాను.

2018-19 ఎన్నికల సమయంలో మా ఇంటికి వచ్చి మా సమస్యను తీర్చుతామని హామీ ఇచ్చారు. ఇంతవరకు అది నెరవేరలేదు. మిమ్మల్ని ఎవరైనా ఎందుకు నమ్మాలి?

మీ సమస్యను తీర్చలేకపోతే దానికి నేను క్షమాపణలు చెబుతున్నాను. ఇప్పటికీ నేను చేయగలిగింది ఏమైనా ఉంటే వివరాలు పంపించండి.

రామ్ చరణ్‌పై మీ అభిప్రాయం ఏమిటి?

వ్యక్తిగతంగా వినమ్రుడు. గొప్ప డ్యాన్సర్. కానీ నేను చిరంజీవి అభిమానిని. అందుకే చిరంజీవి గారి కంటే రామ్ చరణ్ గొప్ప కాదు.

తెలంగాణ అభివృద్ధిపై మీ విజన్? మీరు ఏ జాతీయ పార్టీ వైపు ఉన్నారు?

సామాజిక తెలంగాణ నా లక్ష్యం. మహిళలు, యువతకు వారు కోరుకున్న రంగంలో అవకాశాలు కల్పించేందుకు పని చేస్తా.

ఆసరా, చేయూత పెన్షన్ల పంపిణీలో విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెండి?

జాగృతి జనం బాట పర్యటనలో చాలా సమస్యలు చూసాను. ప్రభుత్వం ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు.

జాగృతి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రారంభించండి.

ప్రణాళిక సిద్ధంగా ఉంది. త్వరలో తేదీలు ప్రకటిస్తాం.

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై అభిప్రాయం?

హామీలు ఇవ్వడంలో విఫలం అయ్యింది. ప్రజలు ప్రభుత్వంపై చాలా అసంతృప్తితో ఉన్నారు. తెలంగాణ రైతుల ఆత్మహత్యలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వ నిర్లక్ష్యమే దీనికి కారణం. ఉద్యోగాల కల్పనకే నేను అధిక ప్రాధాన్యం ఇస్తాను.

# మార్చి 26న ఐపీఎల్ షురూ!

**తొలుత మార్చి 15గా ప్రకటన.. తాజాగా మార్పు**

**మే 31తో ముగియనున్న టీ20 సంబురం**

**నేడు అబుదాబీలో ఐపీఎల్ మినీ ఆక్షన్**

దుబాయ్: ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి బిగ్ అప్‌డేట్ అందింది. లీగ్ ప్రారంభ తేదీ మారినట్లు ప్రముఖ క్రికెట్ వెబ్‌సైట్ క్రిక్‌బజ్ పేర్కొంది. ముందుగా ప్రకటించినట్లు ఐపీఎల్ 2026 మార్చి 15న కాకుండా మార్చి 26న ప్రారంభం కానున్నట్లు తెలిపింది. మే 31తో ముగియనున్నట్లు పేర్కొంది. సోమవారం అబుదాబీలో జరిగిన ఫ్రాంఛైజీల మీటింగ్‌లో ఈ విషయం ఖరారైనట్లు వెల్లడించింది. సీజన్ ఓపెనింగ్ మ్యాచ్ విషయంలో ఇంకా స్పష్టత లేనట్లు ప్రకటించింది. సాధారణంగా సీజన్ ఓపెనర్ డిఫెండింగ్ ఛాంపియన్స్ (ఆర్సీబీ) హెూం గ్రౌండ్‌లో జరుగుతుంది. అయితే బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంపై సందిగ్ధత నెలకొనడంతో ఈ విషయాన్ని ఇంకా ఖరారు చేయలేదు. పై విషయాలను ఐపీఎల్ సీఈవో హేమంగ్ అమిన్ తమతో వెల్లడించినట్లు తెలిపింది. కాగా, మంగళవారం అబుదాబీ వేదికగా ఐపీఎల్ 2026 మినీ వేలం జరుగనున్న విషయం తెలిసిందే. ఈ వేలంలో 10 ఫ్రాంచైజీలకు సంబంధించి 77 స్లాట్లు భర్తీ కానున్నాయి. ఇందులో 31 విదేశీ స్లాట్లు కాగా.. మిగతావన్నీ దేశీయ ఆటగాళ్లతో భర్తీ చేయబడతాయి. 10 ఫ్రాంచైజీల వద్ద రూ. 237.55 కోట్ల నిధులు ఉన్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ వద్ద అత్యధికంగా రూ. 64.30 కోట్లు, రెండో అత్యధికంగా చెన్నై సూపర్ కింగ్స్ వద్ద రూ. 43.40 కోట్లు ఉన్నాయి. ఈ వేలంలో తాజా అడిషన్స్‌తో పాటు (అభిమన్యు ఈశ్వరన్) మొత్తం 369 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

# జిల్లాకో లీగల్ సెల్

మొదటి పేజీ తరువాయి

తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేవలం రెండేళ్ల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్లు, మహిళలకు తులం బంగారం వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 40 నుండి 70 శాతం స్థానాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు గెలవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. సూర్యాపేట జిల్లాలో మల్లయ్య యాదవ్ హత్య, తిప్పర్తిలో కిడ్నాప్ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం చేసిన ప్రజల వ్యతిరేకత నుంచి కాంగ్రెస్‌ని కాపాడలేకపోయారని కేటీఆర్ అన్నారు. మంత్రులు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నాయకుల అరాచకాలకు బెదరకుండా భయపడకుండా ప్రజలు మా పార్టీ నేతలు నిలబడ్డారని.. అందుకే అత్యధిక స్థానాల్లో ప్రతిపక్షంలో ఉన్న మా పార్టీని గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పట్ల నెలకొన్న తీవ్రమైన అసంతృప్తికి వ్యతిరేకతకు పంచాయతీరాజ్ ఎన్నికల ఫలితాలు నిదర్శనం అన్నారు. సర్పంచులు కేవలం పదవులను అలంకారప్రాయంగా కాకుండా, గ్రామ అభివృద్ధికి సాధనంగా వాడుకోవాలని కేటీఆర్ సూచించారు. సూర్యాపేట జిల్లాలోని 'ఏపూర్' గ్రామాన్ని ఉదాహరణగా తీసుకుంటూ.. అక్కడ చెక్ డ్యాంలు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం వంటి నిర్మాణాలతో ఆ గ్రామం దేశంలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందిందని గుర్తుచేశారు. ఐదేళ్ల తర్వాత ప్రజలు మనల్ని గుర్తుపెట్టుకోవాలంటే, మనం చేసిన పనే మనకు శ్రీరామరక్ష అని హితవు పలికారు. పల్లె ప్రగతి ద్వారా ప్రతి ఊరిలో నర్సరీ, డంప్ యార్డ్, ట్రాక్టర్, వైకుంఠధామం వంటివి ఏర్పాటు చేసి గ్రామాల రూపురేఖలు మార్చామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే, గెలిచిన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పంచాయతీరాజ్ చట్టం, విధులు, హక్కులపై అవగాహన కల్పించేందుకు నిపుణులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామని కేటీఆర్ వెల్లడించారు. మిగిలిన విడత ఎన్నికల్లోనూ పార్టీ శ్రేణులు కష్టపడి గులాబీ జెండా ఎగురవేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. దేశ జనాభాలో కేవలం 3 శాతం ఉన్న తెలంగాణ, కేంద్రం ప్రకటించిన ఉత్తమ పంచాయతీ అవార్డుల్లో 30 శాతం కైవసం చేసుకుం దని, ఇది కేసీఆర్ పాలన దక్షతకు నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రికార్డును దేశంలో ఏ రాష్ట్రం కూడా సాధించలేదని అన్నారు. ప్రతి గ్రామంలో కనీస



మౌలిక వసతులను ఏర్పాటు చేశామని ప్రతి గ్రామానికి పరిశుద్ధ నిర్వహణ నుంచి మొదలుకొని పచ్చదనం వరకు తాగునీటి సరఫరా వరకు అన్ని రంగాల్లో అద్భుతమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అందుకే తెలంగాణ పంచాయతీ రాజ్ వ్యవస్థకు కేంద్రం నుంచి అనేక అంశాల్లో ఉత్తమ గ్రామ పంచాయతీలు ఉత్తమ జిల్లా పరిషత్తులు అవార్డులను దక్కించుకున్నాయని అన్నారు.

# కాంగ్రెస్‌కు కాలం చెల్లింది: కేటీఆర్

**రెండో దశ పంచాయతీ ఎన్నికల ఫలితాలపై హర్షం**



హైదరాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): రెండో దశ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరాచక పాలనకు చెంపపెట్టు లాంటివని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో గద్దెనెక్కిందని, ఇప్పుడు ఆ పార్టీకి రాష్ట్రంలో కాలం చెల్లిందని పల్లె ప్రజలు తమ ఓటు ద్వారా స్పష్టమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో అద్వితీయ ఫలితాలు సాధించిన బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ... ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ కోటలు బీటలు వారడం రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో సైతం బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు సత్తా చాటారని, ఇందుకు కృషి చేసిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రేవంత్ రెడ్డి రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే కాంగ్రెస్ పార్టీకి ఉరితాళ్లుగా మారాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ వైఫల్యాలే ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో పెకిలిస్తున్నాయని ఉద్ఘాటించారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయాలు సాధించిందని, కానీ నేడు కాంగ్రెస్ కనీసం సగం పంచాయతీలను కూడా గెలవలేకపోయిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇది అధికార పార్టీపై పల్లెల్లో పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతమని వివరించారు. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే పరిస్థితి ఇలా ఉంటే, ఇక పార్టీ గుర్తుపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇంతకన్నా ఘోర పరాభవం తప్పదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అభయహస్తం కాదని, అదొక రిక్త హస్తమని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి రేవంత్ అసమర్థ పాలనలో అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణను విడిపించే పోరాటంలో తమకు అండగా నిలుస్తున్న ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనాలు తెలుపుతున్నట్లు చెప్పారు. కష్టకాలంలో పార్టీ వెన్నంటి నిలిచిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, వారి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు పార్టీ బంగారు బాటలు వేస్తుందని కేటీఆర్ హామీ ఇచ్చారు.

## నిర్వీర్యానికే నరేగా పేరు మార్పు: సీతక్క



హైదరాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్'గా మార్చాలనే ప్రతిపాదనపై తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పందించారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆమె ఆరోపించారు. పథకం పేరు మార్చడమే కాకుండా, దాని స్ఫూర్తిని, అమలు విధానాన్ని కూడా మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి భరోసా కల్పించాలన్న మహాత్మాగాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆమె అన్నారు. ఈ నిర్ణయం పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని ఆమె తీవ్రంగా విమర్శించారు. గతంలో ఈ పథకానికి వంద శాతం నిధులను సమకూర్చి అమలు చేసిన కేంద్రం, ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమని ఆమె పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆమె అన్నారు. పథకం పేరు నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు, విలువల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని ఆమె అన్నారు. మోదీ ప్రభుత్వానికి మొదటి నుంచి ఈ పథకం పట్ల వ్యతిరేకత ఉందని, అందుకే దశలవారీగా ఈ పథకాన్ని బలహీనపరిచే కుట్రలకు తెరలేపారని ఆమె ఆరోపించారు.

## బీఆర్ఎస్ అభ్యర్థిని ట్రాక్టర్‌తో ఢీకొట్టే యత్నం!

**తీవ్రంగా స్పందించిన కేటీఆర్**

ఎల్లారెడ్డి, డిసెంబర్ 15 (ఈవార్తలు): ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేట గ్రామంలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిని ట్రాక్టర్‌తో ఢీకొట్టిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆయన కోరారు. సంబంధిత ఎస్పీకి ఫోన్ చేసి ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. బీఆర్ఎస్ శ్రేణులు తిరగబడితే శాంతిభద్రతలు అదుపులో ఉండవని ఆయన హెచ్చరించారు. కామారెడ్డి జిల్లా, ఎల్లారెడ్డి మండలం, సోమార్‌పేట గ్రామంలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బాలరాజుని కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన సర్పంచ్ పాపయ్య ట్రాక్టరుతో ఢీకొట్టాడనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్ పాపయ్య అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ, ఎల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ఫోన్ చేసి, ఈ ఘటనలో గాయపడిన నాయకులు, కార్యకర్తల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు.

## అమెరికా మామ ఓటుతో గెలుపు

నిర్మల్, డిసెంబర్ 15 (ఈవార్తలు): ప్రజాస్వామ్యంలో ఒక్క ఓటు ఎంత విలువైందో చాటిచెప్పే ఆసక్తికర ఘటన నిర్మల్ జిల్లాలో చోటుచేసుకుంది. కోడలు ఎన్నికల్లో నిలబడటంతో, ఆమెను గెలిపించడం కోసం అమెరికా నుంచి వచ్చిన మామ గారు వేసిన ఓటు ఆమె విజయంలో కీలకంగా మారింది. కేవలం ఒక్క ఓటు తేడాతో కోడలు సర్పంచ్‌గా విజయం సాధించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే, లోకేశ్వరం మండలం బాగాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి జరిగిన ఎన్నికల్లో ముత్యాల శ్రీవేద పోటీ చేశారు. ఆమె మామ ముత్యాల ఇంద్రకరణ్ రెడ్డి అమెరికాలో ఉంటున్నారు. తన కోడలు ఎన్నికల్లో పోటీ చేస్తుండటంతో ఆమెకు మద్దతుగా నిలిచేందుకు ఆయన పోలింగ్‌కు నాలుగు రోజుల ముందే స్వగ్రామానికి చేరుకున్నారు. ఎన్నికల రోజున తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం జరిగిన ఓట్ల లెక్కింపులో ఫలితం ఉత్కంఠభరితంగా మారింది. గ్రామంలో మొత్తం 426 ఓట్లకు గాను 378 ఓట్లు పోలయ్యాయి. లెక్కింపులో శ్రీవేదకు 189 ఓట్లు రాగా, ఆమె సమీప ప్రత్యర్థి హర్షస్వాతికి 188 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లనిదిగా అధికారులు ప్రకటించారు. దీంతో కేవలం ఒక్క ఓటు తేడాతో శ్రీవేద విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఇంద్రకరణ్ రెడ్డి అమెరికా నుంచి వచ్చి మరీ వేసిన ఆ ఒక్క ఓటే తన కోడలి గెలుపును నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## తండ్రి కళ్ల ముందే కూతురు దుర్మరణం

**రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో విషాదం**

హయత్ నగర్/రంగారెడ్డి, డిసెంబర్ 15 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో వైద్య విద్యార్థిని యంసాయని ఐశ్వర్య (22) అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె తండ్రి పాండు తీవ్రంగా గాయపడ్డారు. వైద్యురాలై ప్రజలకు సేవ చేయాలన్న ఆమె కల కల్లలయ్యింది. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఐశ్వర్య ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతోంది. ఇవాళ ఉదయం హయత్‌నగర్‌లోని ఆర్టీసీ కాలనీ వద్ద తన తండ్రి పాండుతో కలిసి రోడ్డు దాటుతోంది. ఆ సమయంలో వేగంగా వచ్చిన ఓ కారు వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రీకూతుళ్లిద్దరూ తీవ్రంగా గాయపడి రోడ్డుపై కుప్పకూలిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఐశ్వర్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్ర గాయాలతో ఉన్న ఆమె తండ్రి పాండుకు మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి తరలించారు. ఐశ్వర్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వివరాలను సేకరిస్తున్నారు. వైద్య విద్యార్థిని మరణంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## ప్రియుడి కోసం భర్తను ట్రాక్టర్‌తో ఢీకొట్టి

**హత్య చేసిన మహిళ.. వికారాబాద్‌లో ఘటన**

చౌడాపూర్/వికారాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి భార్య హత్య చేయించింది. ట్రాక్టర్‌తో ఢీకొట్టించి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసినప్పటికీ, పోలీసుల విచారణలో అసలు నిజం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రానికి చెందిన రత్నయ్య, కవిత దంపతులు. కవితకు అదే గ్రామానికి చెందిన రామకృష్ణతో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం భర్త రత్నయ్యకు తెలియడంతో ఆయన భార్యను మందలించాడు. దీంతో తమ బంధానికి అడ్డుగా ఉన్న రత్నయ్యను అడ్డు తొలగించుకోవాలని కవిత, రామకృష్ణ పథకం వేశారు. ప్రణాళిక ప్రకారం, ఉదయం పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న రత్నయ్యను రామకృష్ణ ట్రాక్టర్‌తో వేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రత్నయ్య అక్కడికక్కడే మరణించాడు. మొదట ఇది ప్రమాదంగానే అందరూ భావించారు. అయితే రత్నయ్య సోదరుడు తన అన్న మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కీలక మలుపు తిరిగింది. క్షుణ్ణంగా దర్యాప్తు చేసిన పోలీసులకు కవిత, రామకృష్ణల అక్రమ సంబంధం గురించి తెలిసింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, తామే హత్య చేసినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, రత్నయ్య మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

## ముర్ము పర్యటనకు భద్రత కట్టుదిట్టం

హైదరాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): శీతాకాల విడిది నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబర్ 17 నుంచి 22 వరకు ఐదు రోజులపాటు హైదరాబాద్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో భద్రతా ఏర్పాట్లను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రోన్లు, పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాల ఎగరవేతపై నిషేధం విధిస్తూ పోలీసులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతీ నోటిఫికేషన్ విడుదల చేశారు. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డిసెంబర్ 17, 22 తేదీల్లో, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో డిసెంబర్ 20న ఎలాంటి రిమోట్ కంట్రోల్ విమానాలు, డ్రోన్లు ఎగరవేయరాదని స్పష్టం చేశారు. డ్రోన్లు, ఇతర ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## జీహెచ్ఎంసీ డివిజన్ల పెంపుపై సవాల్

**హైకోర్టులో పిటిషన్ దాఖలు.. నేటికి వాయిదా**

హైదరాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): జీహెచ్ఎంసీ డివిజన్ల పెంపును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. వినయ్ కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని ఆయన ఉన్నత న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి విచారణ చేపట్టారు. డివిజన్ల పునర్విభజనలో అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని వినయ్ కుమార్ పేర్కొన్నారు. రాంనగర్ డివిజన్‌పై తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. అనంతరం ఈ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. అటు.. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో నగరానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఎక్స్–అఫీషియో సభ్యులు సమావేశమయ్యారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లతో కలిసి కార్పొరేటర్లు మేయర్‌తో భేటీ అయ్యారు. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనపై ఆమెతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ, డివిజన్ల సరిహద్దులపై మార్కింగ్ చేసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఏ ప్రాతిపదికన డివిజన్ల పునర్విభజన చేశారో చెప్పాలని కోరామని అన్నారు. హైదరాబాద్‌లో డివిజన్ల పునర్విభజనకు ఆదేశిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నగరాన్ని 300 డివిజన్లుగా విభజించారు. ఆయా డివిజన్లకు హద్దులను ప్రకటిస్తూ కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం గెజిట్ ప్రచురించింది.

## యూరియా బుకింగ్‌కు యాప్: తుమ్మల

హైదరాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): గత ఖరీఫ్ సీజన్లో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదురైన సంగతి తెలిసిందే. ఆ ఇబ్బందుల దృష్ట్యా రైతులకు యూరియా సరఫరా కోసం ప్రభుత్వం నూతన విధానం తీసుకు వచ్చింది. రైతులు ఎరువుల దుకాణాల ముందు క్యూ కట్టాల్సిన పని లేకుండా ఇంటి నుంచే యూరియా బుక్ చేసుకునేందుకు త్వరలో మొబైల్ యాప్ విడుదల చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రస్తుత యాసంగికి సరిపడా యూరియాను అన్నదాతలకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇప్పటికే 2.48 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉండగా... కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ నెలకు కేటాయించిన యూరియా కూడా త్వరలోనే రాష్ట్రానికి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## అంగుళం భూమీ కబ్జా కానివ్వం

**మంత్రి పొంగులేటి వెల్లడి**



హైదరాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): హౌసింగ్ బోర్డు భూములు పరిరక్షణకు, అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యలపై సచివాలయంలో హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్, సీఈ వెంకట రమణారెడ్డి అధికారులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమావేశం నిర్వహించారు. హౌసింగ్ బోర్డు భూముల లీజు, అగ్రిమెంట్లు, కోర్టు కేసులు, అద్దెలు తదితర అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఒకవైపు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటూనే మరో వైపు లీజు, కమర్షియల్, అద్దెలు, రెగ్యులరైజేషన్ తదితర అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నిజాం కాలం నుంచి 115 సంస్థలకు హౌసింగ్ బోర్డు భూములను లీజుకు ఇవ్వడం జరిగింది, ఇందులో ప్రధానంగా ఇనిస్ట్యూషన్స్, రెసిడెన్షియల్, కమర్షియల్, స్కూల్స్, టెంపుల్స్ తదితరాలు ఉన్నాయి. ఏడు స్థలాలకు సంబంధించి కోర్టు కేసులు, అలాగే అద్దెబకాయిలు ఉన్నాయి. లీజు అగ్రిమెంట్ పునరుద్దరణ చేసుకోని సంస్థలకు హౌసింగ్ బోర్డు తరపున లేఖలు రాసి వాటి రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఇవ్వాలని అధికారులకు సూచించారు. హౌసింగ్ బోర్డు నిబంధనల ప్రకారం ప్రతి షాపు యజమాని ప్రతి ఏడాది 10శాతం అద్దెను పెంచుతూ షాపును రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని అయితే ఈ నిబంధన అమలు కాకపోవడంతో షాపు యజమానుల నుంచి హౌసింగ్ బోర్డుకు కోట్లాది రూపాయిలు రావలసి ఉందని ఈ సందర్భంగా అధికారులు తెలుపగా.. ప్రస్తుతం షాపులు నిర్వహిస్తున్నవారు ఆ షాపులను కొనుగోలు చేయడానికి ముందుకువస్తే మార్కెట్ ధర ప్రకారం విక్రయించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. అలాగే షాపు నిర్వహణకు అనువుగా లేకపోతే ఆ స్థలాన్నివేలంలో విక్రయించాలని చెప్పారు. కోర్టు కేసులలో ఉన్న భూములు హౌసింగ్ బోర్డుకు చెందేలా పటిష్టమైన వాదన వినిపించేలా ప్రత్యేకంగా అడ్వకేట్‌ను నియమించుకోవాలని, హౌసింగ్ బోర్డు గతంలో కేటాయించిన ఇండ్లకు పక్కనే ఉన్న వంద గజాల లోపు స్థలాలను ఆఇంటి యజమానికి ఆసక్తి ఉంటే విక్రయించాలని అలాగే గతంలో ఇంటి కోసం హౌసింగ్ బోర్డు కేటాయించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోనివారికి ఇప్పుడు రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించాలని, పక్కనే ఉన్న వంద గజాల లోపు స్థలాన్ని కూడా కొనుగోలు చేసుకుంటే మొత్తం స్థలానికి రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. మార్కెట్ ధర, సబ్ రిజిస్ట్రార్ మార్కెట్ కార్డు విలువ వంద గజాల లోపు స్థలాల వివరాలు, రిజిస్ట్రేషన్ కాని ప్లాట్ల వివరాలు, రిజిస్ట్రేషన్ చేసుకొని పక్కనే ఉన్న వంద గజాలలోపు స్థలాన్ని అడుగుతున్నవారి వివరాలు తదితర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక తయారుచేయాలని అధికారులకు సూచించడం జరిగింది.. వీటన్నింటిపై క్యాబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

## నక్సల్ పోరుకు ప్రజా మద్దతు లేదు

**వెలుగులోకి మావోయిస్టు పొలిట్‌బ్యూరో కీలక సర్క్యులర్**



న్యూఢిల్లీ: భారత విప్లవ ఉద్యమానికి అవసరమైన ప్రజాపునాది గణనీయంగా బలహీనపడిందని మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో విడుదల చేసిన కీలక సర్క్యులర్‌లో అంగీకరించింది. 2020 నుంచి 2024 వరకు ఉద్యమ పరిస్థితులపై చేసిన సమీక్షలో, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల వరుస ప్రతిఘాత దాడులు, భద్రతా శిబిరాల విస్తరణ, భారీ బలగాల మోహరింపుతో ప్రజా మద్దతు తగ్గిందని స్పష్టం చేసింది. 'సమాధాన్', 'సూరజ్‌కుండ్' వ్యూహాల అనంతరం 2024 నుంచి అమలవుతున్న 'కగార్' నిర్ణాయక దాడులు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపాయని సర్క్యులర్‌లో పేర్కొంది. ఈ కాలంలో పార్టీ నాయకత్వం నుంచి కింది స్థాయి వరకు మరణాలు, అరెస్టులు, లొంగిపోవడం చోటుచేసుకోవడంతో పార్టీ, సాయుధ దళాల బలం తగ్గిందని వెల్లడించింది. అటవీ ప్రాంతాల్లో కార్పొరేట్ సెక్యూరిటీ విస్తరణతో ఉద్యమ ప్రాంతాలు కుదించబడ్డాయని పేర్కొంది. పట్టణ, సమతల ప్రాంతాల్లో రాజకీయ – సంస్థాగత కార్యకలాపాలు బలహీనపడటం, ప్రజా ఉద్యమాలను పార్టీ, సాయుధ పోరాటంతో సమర్థంగా అనుసంధానం చేయలేకపోవడం వల్ల ప్రజాపునాది మరింత క్షీణించిందని స్వీయ విమర్శ చేసింది. రహస్య పని పద్ధతుల్లో లోపాలు, శత్రు గూఢచర్యాన్ని నియంత్రించడంలో విఫలం కావడం కూడా ప్రధాన కారణాలుగా పేర్కొంది. అయితే, ప్రజా సమస్యలపై ఆందోళనలు, ప్రచార కార్యక్రమాలు, కొన్ని ప్రాంతాల్లో గెరిల్లా చర్యలు కొనసాగినప్పటికీ, అవి ఉద్యమాన్ని ముందుకు నడిపే స్థాయిలో లేవని స్పష్టం చేసింది. ఈ పరిస్థితుల్లో పార్టీని, సాయుధ దళాలను, యునైటెడ్ ఫ్రంట్‌ను, మొత్తం విప్లవ ఉద్యమాన్ని కాపాడుకోవడమే తక్షణ ప్రధాన లక్ష్యమని పొలిట్‌బ్యూరో ప్రకటించింది. భవిష్యత్ వ్యూహంగా ప్రజా ఉద్యమాలను మళ్లీ బలోపేతం చేయడం, పట్టణ – సమతల ప్రాంతాల్లో రాజకీయ పని పెంచడం, చిన్న స్థాయి వికేంద్రీకృత చర్యలపై దృష్టి పెట్టడం, సిద్ధాంత – సంస్థాగత లోపాలను సరిదిద్దేందుకు ఎడ్యుకేషన్ – రెక్టిఫికేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సర్క్యులర్ సూచించింది. ఈ కాలంలో కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిఘాత యుద్ధానికి ఎదురుగా జరిగిన చర్యల్లో కేంద్ర కమిటీ స్థాయి నుంచి సాధారణ విప్లవ ప్రజల వరకు మొత్తం 683 మంది మరణించారని, వారిలో 190 మంది మహిళలని సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. 2021 జనవరి నుంచి మావోయిస్టు పార్టీ నాయకత్వానికి తీవ్ర నష్టాలు వాటిల్లాయని పొలిట్‌బ్యూరో సర్క్యులర్‌లో వెల్లడైంది. కేంద్ర కమిటీకి చెందిన నలుగురు సభ్యులు – లక్కు, అంబర్, సాకేత్, ఆనంద్ – అనారోగ్య కారణాలతో మృతి చెందగా, మరో సభ్యుడు దీపక్ శత్రు దాడిలో మరణించినట్లు పేర్కొంది. అలాగే, కిషన్, శీలా, కాంచన్, కృష్ణమూర్తి, మాంగ్టు, జస్పాల్, మోహిత్, జనార్ధన్, కిషోర్ అనే తొమ్మిది మంది కీలక నేతలు అరెస్టయ్యారని వెల్లడించింది. దీంతో పార్టీ నాయకత్వ నిర్మాణం గణనీయంగా బలహీనపడిందని అంగీకరించింది. ఇదే సమయంలో పార్టీ లైన్‌పై దాడి చేయడం, పార్టీ ఆచరణను దెబ్బతీయడం, విఘాతం సృష్టించే ధోరణితో వ్యవహరించారన్న కారణాలతో కేంద్ర కమిటీ సభ్యులు కొబాడ్ గాంధీ, బచ్చా ప్రసాద్ సింగ్‌లను పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపింది. ప్రస్తుతం తూర్పు ప్రాంతంలో పరిమిత సంఖ్యలోనే నాయకత్వం మిగిలి ఉందని, కేంద్ర ప్రాంతంలోనూ అదే పరిస్థితి నెలకొందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు కేంద్ర కమిటీ నేరుగా మార్గనిర్దేశం చేయలేని పరిస్థితి ఏర్పడిందని సర్క్యులర్ స్పష్టం చేసింది. అదేవిధంగా తూర్పు, కేంద్ర ప్రాంతాల మధ్య సమన్వయం పూర్తిగా లేకపోవడంతో పాటు, దేశవ్యాప్తంగా విప్లవ ఉద్యమానికి సంబంధించిన కేంద్రస్థాయి సమన్వయం కూడా తీవ్రంగా దెబ్బతిన్నదని పొలిట్‌బ్యూరో స్వీయ విమర్శ చేసింది.

## అగ్రి వర్సిటీ అద్భుతం: గవర్నర్

హైదరాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): అగ్రికల్చర్‌యూనివర్శిటీ ప్రవేశాల్లో వ్యవసాయ కూలీల పిల్లలకు 15 శాతం సీట్లు కేటాయించడంపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో యూనివర్శిటీ 37వ ర్యాంకు నుండి 24 వ స్థానానికి ఎగబాకడం ఎంతో అభినందనీయమన్నారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయం విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య లోక్ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా అగ్రి కల్చర్‌యూనివర్శిటీ ప్రగతి నివేదికను గవర్నర్ విడుదల చేసి సాధిస్తున్న ప్రగతిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మంచి పనితీరు కనపరచాలని, అత్యుత్తమ ర్యాంకులు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న మూడు బ్యాచ్ లకు కలిపి ఒకే స్నాతకోత్సవాన్ని నిర్వహించడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా అల్దాస్ జానయ్య చేసిన విజ్ఞప్తిని గవర్నర్, ఛాన్స్ లర్ అంగీకరించారు. త్వరలోనే స్నాతకోత్సవం తేదీలను ఖరారు చేస్తామని హామీ ఇచ్చారు. ఫిబ్రవరిలో మూడు బ్యాచ్ లకు చెందిన 2800 యుజీ, పీజీ, పీహెచ్ డీ విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నట్లు జానయ్య తెలిపారు. ఈ భేటీలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ మల్లారెడ్డి కూడా ఉన్నారు.

## నా తండ్రి రాజకీయాలకు అతీతుడు: ఎస్పీ చరణ్



హైదరాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): తన తండ్రి రాజకీయాలకు అతీతంగా ఉండేవారని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తనయుడు, గాయకుడు ఎస్పీ చరణ్ అన్నారు. హైదరాబాద్ నగరంలోని రవీంద్ర భారతి ప్రాంగణంలో ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ కార్యక్రమం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన తండ్రికి అందరూ సమానమేనని ఆయన పేర్కొన్నారు. ఎస్పీ చరణ్ మాట్లాడుతూ తన తండ్రి ప్రతి ఒక్కరితో స్నేహంగా మెలిగేవారని గుర్తు చేశారు. విగ్రహం ఏర్పాటు చేసినందుకు తెలంగాణ ప్రభుత్వం, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు, బాలు విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన బృందానికి ఆయన కతజ్ఞతలు తెలియజేశారు. రవీంద్ర భారతి ప్రాంగణంలో దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు.



# ఆయిల్‌పామ్‌తో అధిక దిగుబడులు

## జగిత్యాల జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్

మల్యాల, డిసెంబర్ 15 (ఈవార్తలు): ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జగిత్యాల జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ అన్నారు. సోమవారం మల్యాల మండలం మద్దుట్లలో ఆయిల్ పామ్ మెగా ప్లానిటేషన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటి, ఆయిల్ పామ్ పంట యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో లోహియా మేనేజర్ విజయ్ భరత్, ఉద్యన విస్తీర్ణ అధికారి అనిల్, రైతులు పాల్గొన్నారు.




# అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరికలు

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల/గంగాధర, డిసెంబర్ 15 (ఈవార్తలు): కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం గంగాధర ప్రజాకార్యాలయంలో.. మల్యాల మండలం మనాల గ్రామ సర్పంచ్ బల్మూరి పాపారావు, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ముందుంటుంది. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోంది. వర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం' అని స్పష్టం చేశారు.

# రాజన్న భక్తుల స్నానాలకు వేడినీళ్లు



వేములవాడ, డిసెంబర్ 15 (ఈవార్తలు): వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. చలికాలం దృష్ట్యా భక్తులు స్నానం చేసేందుకు ప్రత్యేకంగా వేడి నీరు (హాట్ వాటర్) సదుపాయం కల్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్నాన ఘాట్ల వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, భక్తులు సులభంగా స్నాన ప్రాంతాలను గుర్తించేలా చర్యలు తీసుకున్నారు. అవసరమైన మార్గదర్శక సూచనలు కూడా ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యం దృష్ట్యా పరిశుభ్రత, నీటి సరఫరా, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఈ ఏర్పాట్లతో భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.



# ఫ్రస్టేషన్‌లో కేటీఆర్: ఆది

వేములవాడ, డిసెంబర్ 15 (ఈవార్తలు): పంచాయతీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫ్రస్టేషన్‌లో ఉన్నారని, ఏదేదో మాట్లాడుతున్నారని వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. నాలుగు సార్లు ఓడిపోయాక కన్నీళ్లు పెట్టుకుంటే నాలుగు ఓట్లతో తాను గెలిచానన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ఆది శ్రీనివాస్ సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖతం అయ్యింది. 2009 లో కేటీఆర్ నువ్వు గెలిచింది కేవలం 175 ఓట్ల తేడాతోనే. అది మరిచిపోకు. నేను ఓడినా, గెలిచినా ప్రజల మధ్యే ఉన్నా. మలా ప్రజలను విడిచి పట్టణానికి పారిపోలేదు. కేటీఆర్ ఫ్రస్టేషన్‌లో ఏదో మాట్లాడుతున్నారు' అని మండిపడ్డారు.

# దివ్వెల మాధురి బంధువుకు నోటీసులు

హైదరాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): వైసీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పాల్గొన్న మొయినాబాద్ ఫాంహౌస్ పార్టీ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పార్టీ నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశారు. అయితే, ఈ కేసులో ఎమ్మెల్సీ దువ్వాడ పేరు లేకపోవడం గమనార్హం. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో దివ్వెల మాధురి బంధువు పార్థసారథి పుట్టినరోజు వేడుకను అనుమతి లేకుండా నిర్వహించారు. అదే రోజున దివ్వెల మాధురి పుట్టినరోజు కూడా ఉండడంతో, ఘనంగా వేడుకలు జరపాలని నిర్ణయించారు. ఈ పార్టీకి దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురితో పాటు మొత్తం 26 మంది హాజరయ్యారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ పోలీసులు ఆ ఫాంహౌస్‌పై దాడి చేశారు. అక్కడి నుంచి 10 విదేశీ మద్యం బాటిళ్లు, ఐదు హుక్కాలను స్వాధీనం చేసుకుని, దువ్వాడ, మాధురి, ఆమె బంధువు పార్థసారథిని విచారించారు. తాజాగా ఈ ఘటనపై మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈవెంట్‌ను నిర్వహించింది మాధురి బంధువైన అమలాపురం వాసి పార్థసారథిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా విదేశీ మద్యం, హుక్కా వినియోగించినందుకు కేసు నమోదు చేసినట్లు తెలిపి, కోర్టు విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు ఇచ్చారు.

# వాజ్‌పేయి స్ఫూర్తితోనే ప్రధానిగా మోదీ

## ఏపీ మంత్రి సత్యకుమార్ వెల్లడి

నెల్లూరు, డిసెంబర్ 15 (ఈవార్తలు): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని స్ఫూర్తిగా తీసుకునే ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని పాలిస్తున్నారని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. వాజ్‌పేయి వ్యక్తిత్వం, ఆలోచనా విధానం, పాలనా శైలి మోదీకి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. నెల్లూరులో జరిగిన 'అటల్ మోదీ సుపరిపాలన యాత్ర' సభలో ఆయన ప్రసంగించారు. వాజ్‌పేయిని అత్యంత దగ్గరగా చూసిన వ్యక్తిగా ఆయన గొప్పతనాన్ని అర్థంచేసుకున్నానని సత్యకుమార్ చెప్పారు. 63 ఏళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్నా, బీజేపీ కేవలం రెండు సీట్లు గెలిచినప్పుడు కూడా ఆయన మనోస్థైర్యం కోల్పోలేదని గుర్తుచేశారు. "అపజయాన్ని అంగీకరించను, కాలం రాసిన రాతను మారుస్తా" అంటూ కవిత్వం ద్వారా ఆయన చూపిన ఆత్మవిశ్వాసమే బీజేపీకి కొత్త మార్గం వేసిందని తెలిపారు. వాజ్‌పేయి వేసిన బాటలోనే నరేంద్ర మోదీ వంటి ఎందరో నేతలు ఎదిగారని, ఆయన స్ఫూర్తితోనే మోదీ దేశ ప్రధాని అయ్యారని సత్యకుమార్ కొనియాడారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక విషయాన్ని వెల్లడించారు. త్వరలోనే విశాఖపట్నం, అమరావతిలో మెట్రో రైలు ప్రాజెక్టులు రానున్నాయని మంత్రి ప్రకటించారు. రక్షణ, వ్యవసాయ రంగాల్లో వాజ్‌పేయి నాటిన విత్తనాలే నేడు ఫలాలు ఇస్తున్నాయని చెప్పారు. పాకిస్థాన్‌కు స్నేహహస్తం అందించినా కుట్రలు ఆపకపోవడంతో సమరానికి సిద్ధమై బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. గడచిన 11 ఏళ్ల మోదీ పాలనలో దేశంలో ఒక్క పెద్ద ఉగ్రదాడి కూడా జరగలేదని, సర్జికల్ స్ట్రైక్స్‌తో భారత్ తన సత్తా చాటిందని తెలిపారు.

# పోలీసు శాఖలో 1000 కోట్ల ప్రాజెక్టులు

అమరావతి, డిసెంబర్ 15 (ఈవార్తలు): ఏపీలో మోడల్ పోలీస్టేషన్ల నిర్మాణం గత ఐదేళ్లలో పూర్తిగా నిలిచిపోయిందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. 2019కి ముందు తమ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మోడల్ పోలీస్టేషన్లనే గత ప్రభుత్వం పట్టించుకోలేదని, తనను అరెస్టు చేసి అలాంటి ఒక స్టేషన్‌లోనే కూర్చోబెట్టారని ఆమె గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ మోడల్ పోలీస్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు. సోమవారం ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాస్ (కేకే) బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అనిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికే రూ.509 కోట్లతో పలు భవన నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. త్వరలోనే రూ.179 కోట్లతో కొత్త నిర్మాణాలు, రూ.412 కోట్లతో గ్రేహౌండ్స్ భవనాల నిర్మాణం ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చేతిలో సుమారు రూ.1000 కోట్ల విలువైన ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయని మంత్రి వివరించారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కార్యాలయాలు లేవని, వాటి నిర్మాణాలపై దృష్టి సారిస్తామన్నారు. కొత్త ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఎండీ రవిప్రకాశ్ నాయకత్వంలో ఈ ప్రాజెక్టులన్నీ విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ మాట్లాడుతూ... తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో కార్పొరేషన్‌లో ఎలాంటి నిర్మాణాలు జరగలేదని విమర్శించారు.



# ఎస్పీ బాలు సంస్కారవంతుడు

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

### రవీంద్రభారతిలో ఎస్పీబీ కాంస్య విగ్రహావిష్కరణ

రవీంద్రభారతి/హైదరాబాద్, డిసెంబర్ 15 (ఈవార్తలు): గాన గంధర్వుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఎస్పీబీతో తనకున్న అనుబంధాన్ని, ఆయన గొప్పతనాన్ని స్మరించుకున్నారు. అశేష ప్రజల అభిమానాన్ని పొందిన గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, బాలసుబ్రహ్మణ్యం కేవలం స్వర సార్వభౌముడు మాత్రమే కాదని, ఆయన గొప్ప సంస్కారవంతుడని, నిరాడంబరుడని కొనియాడారు. ఆయన గాత్రంలో నవరసాలు నాట్యం చేసేవని, ఆయన ఆలపించిన ప్రతీ పాట భావ జలపాతమని అభివర్ణించారు. "సంగీత దర్శకులు, గేయ రచయితలు ఏది కోరుకుంటే అది పలికించే ఒక అక్షయపాత్ర ఆయన గళం. ఎంతో మంది నటుల నటనా శైలికి, వారి హావభావాలకు అనుగుణంగా గాత్రధర్మాన్ని మార్చుకుని పాడటం ఆయనకు మాత్రమే సాధ్యమైంది" అని ప్రశంసించారు. బాలు కేవలం గాయకుడిగానే కాకుండా, డబ్బింగ్ కళాకారుడిగా, నటుడిగా, మార్గదర్శిగా తన బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారని వెంకయ్యనాయుడు గుర్తుచేశారు. ఆయనలో ఒక గొప్ప వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఉన్నారని, 'పాడుతా తీయగా' వంటి కార్యక్రమాల్లో చిన్నారులను ఆయన ప్రోత్సహించిన తీరు అద్భుతమని కొనియాడారు. కేవలం సంగీత పాఠాలే కాకుండా, వారికి జీవిత సత్యాలను బోధిస్తూ, వారిలో సంస్కార బీజాలు నాటేందుకు ప్రయత్నించారని వివరించారు. చిన్నారులకు ఆయన చూపిన మార్గదర్శనం, పెద్దల పట్ల ఆయన చూపిన గౌరవం నేటి తరానికి ఆదర్శనీయమని వెంకయ్యనాయుడు అన్నారు. ఎస్పీబీ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాటల రూపంలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పేర్కొన్నారు. మన భాషా సంస్కృతులను పరిరక్షించుకోవడమే మనం ఎస్పీబీకి ఇచ్చే నిజమైన, సార్థకమైన నివాళి అవుతుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# కోటి సంతకాలు సక్సెస్

## ఇది బాబు ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల తీర్పు

## వైద్య విద్యను దోచుకునే దోపిడీకి వెంటనే తెరపడాలి

### మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్





తాడేపల్లి, డిసెంబర్ 15 (ఈవార్తలు): మెడికల్ కాలేజీలప్రైవేటీకరణ అంశానికి సంబంధించి కోటి సంతకాల సేకరణ అనంతరం వాటిని జిల్లా కేంద్రాల నుండి తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి తరలింపులో భాగంగా ఈరోజు(డిసెంబర్చే 15వ తేదీ) చేపట్టిన ర్యాలీలు విజయవంతం కావడంపై పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇది కేవలం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమం మాత్రమే కాదని, చంద్రబాబు ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజలు ఇచ్చిన ఘనమైన తీర్పు అని అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన ఒక కోటి సంతకాల ఉద్యమం అత్యంత విజయవంతమైనదిగా వైఎస్ జగన్ అభివర్ణించారు. 'ఇది చరిత్రాత్మకంగా నిలిచిపోతుంది. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన భారీ ర్యాలీలు, అందులో ప్రజల సంతకాల ప్రదర్శన ఇవన్నీ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనను, విధానాలను ప్రజలు ఎంత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారో స్పష్టంగా చాటుతున్నాయి. ఇది కేవలం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమం మాత్రమే కాదు. చంద్రబాబు నాయుడు ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ఇచ్చిన ఘనమైన తీర్పు. ప్రజాప్రయోజనాలను ఫణంగా పెడుతూ, వారికి ద్రోహం చేస్తూ ఆయన తీసుకున్న నిర్ణయాలను ఖండిస్తూ, ఒక కోటికి పైగా పౌరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేశారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొని సంతకాలు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ద్వారా అందుబాటులో ఉన్న వైద్య విద్యను, ప్రజారోగ్య వ్యవస్థను నాశనం చేస్తారనే ప్రజల ఆందోళనే ఈ ఉద్యమానికి ప్రధాన ప్రేరణగా నిలిచింది. సేకరించిన ఒక కోటి సంతకాల పత్రాలు ప్రస్తుతం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి చేరుతున్నాయి. అక్కడి నుంచి డిసెంబర్ 18న గౌరవ గవర్నర్‌గారికి అధికారికంగా సమర్పిస్తాం. తద్వారా ప్రజల గొంతు రాష్ట్రంలోని అత్యున్నత రాజ్యాంగాధికారికి చేరి, అనంతరం అది న్యాయస్థానాల తలుపులు తడుతుంది. ఈ ఉద్యమానికి అండగా నిలిచిన ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, పార్టీ కార్యకర్తలు, అలాగే స్వచ్ఛందంగా సంతకాలు చేసిన ప్రతి పౌరుడికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఉద్యమంలో మీ భాగస్వామ్యం ద్వారా ప్రజా ఆస్తులను ప్రైవేట్‌కు అప్పగించాలన్న కూటమి ప్రభుత్వ కుట్ర బట్టబయలైంది. ఈ ఉద్యమం ద్వారా చంద్రబాబు నాయుడు పాలనపై ప్రజలు తమ ఆగ్రహాన్ని తెలియజేశారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలను అమ్మేయాలన్న ఆయన ప్రయత్నాన్ని, ఆయన నిర్ణయాలను, ఆయన పాలనను ఒక కోటి మంది ప్రజలు తిరస్కరించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై తీసుకున్న ఈ ప్రజావ్యతిరేక నిర్ణయాన్ని చంద్రబాబు నాయుడు తక్షణమే వెనక్కి తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నాను.. ప్రజారోగ్య వ్యవస్థను, అందుబాటులో ఉన్న వైద్య విద్యను దోచుకునే ఈ పట్టపగలు దోపిడీకి వెంటనే తెరపడాలి' అని పేర్కొన్నారు.

## డే ఆఫ్ శాక్రిఫైస్‌గా

# పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం

### అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తాం: చంద్రబాబు



విజయవాడ, డిసెంబర్ 15 (ఈవార్తలు): తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని ఇకపై అధికారికంగా 'డే ఆఫ్ శాక్రిఫైస్' (త్యాగాల దినం)గా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆయన త్యాగానికి గుర్తుగా రాజధాని అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తామని వెల్లడించారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "బ్రిటిష్ వారిపై స్వాతంత్ర్యం కోసం, ఆ తర్వాత తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు పొట్టిశ్రీరాములు. పాలకుల వివక్షకు గురైన తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారు. ఆయన కృషితోనే 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం, 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాయి. కొందరు ఈ తేదీలపై అనవసర రాజకీయం చేస్తున్నందునే, ఆయన ఆత్మార్పణ చేసిన రోజునే త్యాగాలకు గుర్తుగా నిర్వహించాలని నిర్ణయించాం" అని స్పష్టం చేశారు. పొట్టిశ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదని, యావత్ తెలుగు ప్రజల ఆస్తి, గుండె చప్పుడు అని కొనియాడారు. పొట్టిశ్రీరాములు స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. అమరావతిలో స్మృతి వనంతో పాటు, చెన్నైలో ఆయన తుదిశ్వాస విడిచిన భవనాన్ని, నెల్లూరులోని నివాసాన్ని మెమోరియల్స్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ గతంలో తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టిశ్రీరాములు పేరు పెట్టారని, తాను కూడా నెల్లూరు జిల్లాకు పొట్టిశ్రీరాములు పేరు పెట్టానని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "మూడు రాజధానుల పేరుతో మహా కుట్ర పన్నారు. అసలు రాజధానే లేకుండా చేసి ప్రపంచం ముందు రాష్ట్రాన్ని అపహాస్యం చేశారు. కనీసం రాజధాని పేరు చెప్పుకోలేని దుస్థితి కల్పించారు. కానీ ఇప్పుడు మన రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకుంటున్నాం" అని అన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని, 18 నెలల్లోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల ఏర్పాటుపై వస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఈ విధానం వల్లే రహదారులు, విమానాశ్రయాలు అభివృద్ధి చెందాయని, ఇది పార్లమెంటరీ కమిటీ కూడా సమర్థించిన ఉత్తమ విధానమని అన్నారు. కాలేజీలు ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం పేరును 'వాసవీ పెనుగొండ'గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. దీంతో ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, మహిళలు ప్లకార్డులు ప్రదర్శించి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ, తెలుగు జాతిని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడమే ఎన్డీఏ కూటమి లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# ఆరోపణలు కాదు.. నిరూపించు!

## పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డి సవాల్

తాడిపత్రి, డిసెంబర్ 15 (ఈవార్తలు): ఏపీలోని అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. భూకబ్జా ఆరోపణలపై పెద్దారెడ్డి చేసిన ఫిర్యాదుకు జేసీ ప్రభాకర్ రెడ్డి గట్టిగా బదులిచ్చారు. ఆరోపణలు చేయడం కాదు, దమ్ముంటే వచ్చి అక్రమ నిర్మాణాలు ఎక్కడున్నాయో నిరూపించాలని పెద్దారెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. ఎర్ర కాలువ, రహదారి నిర్మాణంపై కేతిరెడ్డి పెద్దారెడ్డి రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జేసీ ప్రభాకర్ రెడ్డి స్పందించారు. "ఎర్ర కాలువ, రోడ్డు కోసం స్థల యజమానులతో మాట్లాడి ఏడు మీటర్ల స్థలాన్ని పంచాయతీరాజ్‌కు అప్పగించాం. నిధులు లేకపోవడంతో ఆ పనిని ఆర్ అండ్ బీ శాఖకు బదిలీ చేశారు. వారు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చారు. ఆ ప్రాంతంలోని భూమి మొత్తం ప్రైవేటు వ్యక్తులదే. వారే 20 మీటర్ల స్థలాన్ని రోడ్డు కోసం వదిలి ప్లాట్లు వేసుకున్నారు" అని జేసీ వివరించారు. అయితే, ఇందులో అక్రమ ప్లాట్లు ఎక్కడున్నాయో పెద్దారెడ్డి వచ్చి నిరూపించాలని జేసీ డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను నిరూపించాలంటూ తమ కౌన్సిలర్లు రేపు ఉదయం పెద్దారెడ్డి తండ్రి విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తారని తెలిపారు. "పెద్దారెడ్డి వచ్చి ఏ నిర్మాణం అక్రమమని చూపిస్తే, దానిని కూల్చివేయడానికి నేను సిద్ధం" అని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.



# జోర్డాన్‌లో ప్రధాని మోదీ

**స్వాగతం పలికిన జోర్డాన్ ప్రధాని.. ఉగ్రవాద నిర్మూలన, వాణిజ్య సహకారంపై కీలక చర్చలు**



అమ్మాన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల విదేశీ పర్యటనను సోమవారం ప్రారంభించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన తొలి మజిలీగా జోర్డాన్‌లోని అమ్మాన్‌కు చేరుకున్నారు. విమానాశ్రయంలో జోర్డాన్ ప్రధాని జాఫర్ హసన్ స్వయంగా మోదీకి స్వాగతం పలికి ప్రత్యేక గౌరవం కల్పించారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా జోర్డాన్ తర్వాత ఇథియోపియా, ఒమన్ దేశాలను సందర్శించనున్నారు. భారత్-జోర్డాన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు చారిత్రక ప్రాధాన్యత సంతరించుకుంది. 37 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత ప్రధాని ఒకరు జోర్డాన్‌లో పూర్తిస్థాయి ద్వైపాక్షిక పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి. తన రెండు రోజుల పర్యటనలో ప్రధాని మోదీ.. జోర్డాన్ రాజు అబ్దుల్లా ఇబ్న్ అల్ హుస్సేన్‌తో సమావేశమై ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. అలాగే, ప్రధాని జాఫర్ హసన్, యువరాజు అల్ హుస్సేన్ బిన్ అబ్దుల్లాతోనూ భేటీ కానున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఇరు దేశాలు పరస్పరం సహకరించుకుంటున్నాయి. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడిని జోర్డాన్ రాజు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో తిరస్కరించాలని స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కూడా బలంగా ఉన్నాయి. జోర్డాన్‌కు భారత్ మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి కాగా, ద్వైపాక్షిక వాణిజ్యం 2.8 బిలియన్ డాలర్లుగా ఉంది. ముఖ్యంగా, భారతదేశానికి అవసరమైన ఫాస్ఫేట్, పొటాష్ వంటి ఎరువుల సరఫరాలో జోర్డాన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అక్కడి ప్రవాస భారతీయులతో కూడా సమావేశం కానున్నారు. జోర్డాన్‌లో సుమారు 17,500 మంది భారతీయులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. ఇటీవల అమ్మాన్-ముంబై మధ్య నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం కావడం ఇరు దేశాల మధ్య రాకపోకలను సులభతరం చేసింది.

### పొగమంచుతో పర్యటన ఆలస్యం

ప్రధానమంత్రి మోదీ మూడు దేశాల పర్యటనకు సోమవారం ఉదయం బయలుదేరాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా జాప్యం నెలకొంది. దట్టమైన పొగమంచు దేశ రాజధాని ఢిల్లీని కమ్మేయడంతో ఆయన ప్రయాణించాల్సిన విమానం టేకాఫ్ ఆలస్యమైంది. షెడ్యూల్ ప్రకారం ప్రధాని మోదీ జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల పర్యటన కోసం సోమవారం ఉదయం 8:30 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరాల్సింది. అయితే విమానాశ్రయంలో వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ప్రధాని పర్యటన ఆలస్యమైనట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి.

## తమిళనాడులో బీజేపీ ఎప్పటికీ గెలవదు: స్టాలిన్

చెన్నై: "ఇది తమిళనాడు. ఇక్కడ బీజేపీ ఎప్పటికీ గెలవలేదు. అహంకారం కలిగిన ఏ పార్టీకి ఇక్కడ అవకాశం లేదు. అలాంటి ఏ రాజకీయ శక్తినైనా మేం ప్రతిఘటిస్తాం" అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత తమ లక్ష్యం తమిళనాడు అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో స్టాలిన్ పైవిధంగా మాట్లాడారు. తిరువణ్ణామలై జిల్లాలో జరిగిన పార్టీ యూత్ వింగ్ నార్త్ జోన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమిత్ షా లేదా సంఘ పరివార్ తమిళనాడులో విజయం సాధించలేరని అన్నారు. బీజేపీ తమిళ ప్రజల ఆలోచనను ఎప్పటికీ అర్థం చేసుకోలేదని ఆయన అన్నారు. ప్రేమతో మా వద్దకు వస్తే ఆలింగనం చేసుకుంటామని, అహంకారంతో వస్తే మాత్రం తలవంచే పరిస్థితి లేదని అన్నారు. బీజేపీని నేరుగా ఎదుర్కొని ఓడిస్తామని వ్యాఖ్యానించారు. బీజేపీ వరుసగా మూడవసారి జాతీయస్థాయిలో అధికారంలోకి వచ్చిన తర్వాత మితవాద శక్తులు దూకుడుగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈ శక్తులు ప్రజలను మోసం చేయడానికి తియ్యని అబద్ధాలు చెబుతున్నాయని విమర్శించారు. అలాంటి వారితో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బీజేపీ ఎప్పటికీ తమిళనాడులో గెలవదని స్టాలిన్ అన్నారు.

# ఢిల్లీలో 100 విమానాల రద్దు

**కమ్మేసిన దట్టమైన పొగమంచు.. 'తీవ్ర' స్థాయికి చేరిన వాయు నాణ్యత సూచీ**

**నిర్మాణాలపై నిషేధం, ఆఫీసులకు వర్క్ ఫ్రమ్ హోమ్**

**ఢిల్లీకి వాతావరణ శాఖ 'ఆరెంజ్' అలర్ట్ జారీ**



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని సోమవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. వాయు కాలుష్యం 'తీవ్ర' స్థాయికి చేరడంతో నగరం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో దృశ్యమానత తగ్గింది. ఫలితంగా విమాన, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం, ఉదయం 6 గంటలకు ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ 456గా నమోదైంది. ఇది ఈ సీజన్‌లోనే రెండో అత్యంత గరిష్ఠ స్థాయి. ఆదివారం ఏక్యూఐ 461గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అక్షర్‌ధామ్ వద్ద ఏక్యూఐ 493గా, బారాఖంబా రోడ్డులో 474గా నమోదైంది. కాలుష్యం కారణంగా ఏర్పడిన పొగమంచుతో ఢిల్లీ విమానాశ్రయంలో సుమారు 100 విమానాలు రద్దు కాగా, 300కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు 90కి పైగా రైళ్లు 6 నుంచి 7 గంటల పాటు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి సంస్థలు ప్రయాణికులకు ప్రత్యేక సూచనలు జారీ చేశాయి. ప్రయాణానికి ముందు తమ విమాన సర్వీసుల వివరాలు తెలుసుకోవాలని కోరాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) కింద అత్యంత కఠినమైన స్టేజ్-%×ఐ% ఆంక్షలను అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో అన్ని రకాల నిర్మాణ, కూల్చివేత పనులపై నిషేధం విధించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో 50 శాతం సిబ్బందికి వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు జారీ అయ్యాయి. 10వ తరగతి మినహా మిగిలిన తరగతులకు హైబ్రిడ్ విధానంలో క్లాసులు నిర్వహించాలని పాఠశాలలను ఆదేశించారు. మరోవైపు భారత వాతావరణ శాఖ ఢిల్లీకి 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది.

# నాటో సభ్యత్వాన్ని వదులుకుంటాం.. కానీ!

**ఉక్రెయిన్ శాంతి చర్చల్లో జెలెన్‌స్కీ కొత్త ప్రతిపాదన**

**పశ్చిమ దేశాల నుంచి భద్రతా హామీలు కోరుతున్న ఉక్రెయిన్**



కీవ్: రష్యాతో యుద్ధాన్ని ముగించే దిశగా ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఒక కీలక ప్రతిపాదన చేశారు. పశ్చిమ దేశాలు తమకు స్పష్టమైన భద్రతా హామీలు ఇస్తే, నాటో కూటమిలో చేరాలన్న తమ ప్రయత్నాలను విరమించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. అయితే, రష్యాకు భూభాగాన్ని అప్పగించాలన్న అమెరికా ఒత్తిడిని మాత్రం తీవ్రంగా వ్యతిరేకించారు. ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లతో జరిపిన చర్చల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా, కొన్ని ఐరోపా దేశాలు నాటో సభ్యత్వానికి అంగీకరించనందున, కనీసం ఆ కూటమి సభ్యులకు లభించే తరహాలో తమకు భద్రతా హామీలు ఆశిస్తున్నామని జెలెన్‌స్కీ తెలిపారు. భవిష్యత్తులో రష్యా మళ్లీ దాడి చేయకుండా ఈ హామీలు నిరోధిస్తాయని, ఇది తమ వైపు నుంచి ఒక రాజీ సూత్రమని ఆయన పేర్కొన్నారు. ఈ హామీలకు అమెరికా కాంగ్రెస్ చట్టబద్ధమైన మద్దతు ఉండాలని ఆయన తెలిపారు. చర్చల సందర్భంగా తూర్పు దొనెట్స్క్ ప్రాంతం నుంచి ఉక్రెయిన్ వైదొలగి, అక్కడ సైనిక రహిత స్వేచ్ఛా వాణిజ్య మండలిని ఏర్పాటు చేయాలన్న అమెరికా ప్రతిపాదనను జెలెన్‌స్కీ తిరస్కరించారు. "ఆ ప్రాంతాన్ని ఎవరు నిర్వహిస్తారు? మేం వెనక్కి తగ్గితే, రష్యా దళాలు కూడా ఆక్రమిత ప్రాంతాల నుంచి అంతే దూరం వెనక్కి వెళ్లాలి కదా?" అని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఎవరి బలగాలు ఎక్కడున్నాయో అక్కడే యథాతథ స్థితిని కొనసాగించడమే సరైన పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు నాటోలో చేరాలన్న ఆలోచనను ఉక్రెయిన్ పూర్తిగా విరమించుకోవాలని రష్యా మొదటి నుంచి డిమాండ్ చేస్తోంది. శాంతి ఒప్పందంలో భాగంగా దొనెట్స్క్‌ను వదులుకునే ప్రసక్తే లేదని రష్యా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ చర్చల నేపథ్యంలో ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు ఉక్రెయిన్‌కు తమ మద్దతు కొనసాగిస్తామని ప్రకటించాయి. ప్రస్తుతం ఇరుపక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నప్పటికీ, భూభాగాల నియంత్రణ అంశం శాంతి ప్రక్రియకు పెద్ద అడ్డంకిగా మారింది.

## భారత్-అమెరికా బంధం దెబ్బతిన్నది

**అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి ఆందోళన**

వాషింగ్టన్: భారత్-అమెరికా మధ్య వ్యూహాత్మక సంబంధాలు ప్రస్తుతం 'చల్లగా, గడ్డకట్టినట్లుగా' మారాయని అమెరికాకు చెందిన ప్రముఖ భారత సంతతి కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు దశాబ్దాలుగా ఎంతో శ్రమించి నిర్మించుకున్న ఈ భాగస్వామ్యాన్ని ఇటీవలి కాలంలో అమెరికా తీసుకుంటున్న కొన్ని విధాన నిర్ణయాలు దెబ్బతీస్తున్నాయని హెచ్చరించారు. షికాగోలో జరిగిన 'ఇండియా అబ్రాడ్ డైలాగ్' కార్యక్రమంలో ఆయన కీలక ప్రసంగం చేశారు. "ప్రస్తుతం బయట ఉన్న వాతావరణం, ఇరు దేశాల మధ్య సంబంధాలకు సరిగ్గా సరిపోతుంది. కాస్త చల్లగా, గడ్డకట్టినట్లుగా ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన భారత్‌తో సంబంధాలు వాస్తవానికి మరింత వెచ్చగా, బలంగా ఉండాలని, కానీ అందుకు విరుద్ధంగా జరుగుతోందని ఆయన విచారం వ్యక్తం చేశారు. భారత్‌పై 50 శాతం టారిఫ్‌లు విధించాలనే ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనను ఆయన తీవ్రంగా విమర్శించారు. దీనికి ఎలాంటి తర్కం లేదని, ఇది పూర్తిగా ఏకపక్ష నిర్ణయమని అన్నారు. "ఈ నిర్ణయం ఏదో 'ట్రూత్ సోషల్' ట్వీట్ నుంచి పుట్టినట్లుంది. విదేశీ వాణిజ్య విధానాలు ఇలా ఉండకూడదు" అని ఆయన ఎద్దేవా చేశారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రభావాన్ని ఎదుర్కోవడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో, ఆ దేశం కంటే భారత్‌పై అధిక సుంకాలు విధించడం వ్యూహాత్మక తప్పిదమని స్పష్టం చేశారు. ఆర్థిక, సైనిక, సాంకేతిక రంగాల్లో చైనా నుంచి 'త్రిముఖ ముప్పు' పొంచి ఉందని కృష్ణమూర్తి హెచ్చరించారు. మేధో సంపత్తిని దొంగిలించడం, రాయితీలతో కూడిన వస్తువులతో మార్కెట్లను ముంచెత్తడం వంటి చర్యలకు చైనా పాల్పడుతోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో భారత్ వంటి మిత్రులను దూరం చేసుకోవడం సరికాదని ఆయన సూచించారు. చట్టబద్ధమైన వలసలను ఆయన సమర్థిస్తూ, అమెరికా అభివృద్ధికి ఇవి 'బంగారు గుడ్లు పెట్టే బాతు'ల వంటివని అభివర్ణించారు. 5 మిలియన్ల మంది ఉన్న భారతీయ అమెరికన్లను 'భారత్ యొక్క గొప్ప ఎగుమతి'గా అభివర్ణించిన ఆయన.. వాషింగ్టన్-న్యూఢిల్లీ మధ్య ఇది వారధిగా పనిచేస్తోందని ప్రశంసించారు.

# సిడ్నీ కాల్పుల్లో తండ్రీకొడుకులే హంతకులు

సిడ్నీ: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ప్రఖ్యాత బోండీ బీచ్‌లో యూదుల హనుక్కా వేడుకలో జరిగిన కాల్పుల ఘటనను పోలీసులు ఉగ్రదాడిగా ప్రకటించారు. ఈ ఘాతుకానికి పాల్పడింది తండ్రీకొడుకులని, వీరి వయసు 50, 24 సంవత్సరాలని న్యూ సౌత్ వేల్స్ పోలీసులు సోమవారం వెల్లడించారు. ఈ దాడిలో ఇతర నిందితుల ప్రమేయం లేదని కూడా వారు స్పష్టం చేశారు. న్యూ సౌత్ వేల్స్ పోలీస్ కమిషనర్ మాల్ లాన్యన్ మాట్లాడుతూ పోలీసుల ఎదురుకాల్పుల్లో 50 ఏళ్ల తండ్రి అక్కడికక్కడే మరణించగా, 24 ఏళ్ల కొడుకు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో పోలీసుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. దర్యాప్తులో భాగంగా సిడ్నీ శివార్లలోని బోనీరిగ్, క్యాంప్సీ ప్రాంతాల్లో ఉన్న రెండు ఇళ్లపై దాడులు చేసి సోదాలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. మరణించిన 50 ఏళ్ల వ్యక్తి లైసెన్సుడ్ గన్ హోల్డర్ అని, అతడి పేరు మీద ఆరు తుపాకులు రిజిస్టర్ అయి ఉన్నాయని కమిషనర్ నిర్ధారించారు. దాడిలో బహుశా అవే ఆయుధాలను వాడి ఉంటారని భావిస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలం సమీపంలో రెండు శక్తివంతమైన బాంబులను కూడా కనుగొని నిర్వీర్యం చేసినట్లు ఆయన వెల్లడించారు. దాడి వెనుక ఉన్న ఉద్దేశంపై దర్యాప్తు కొనసాగుతోందని, ఘటనా స్థలంలో ఐసిస్ జెండా లభించిందన్న వార్తలపై ఆయన స్పందించలేదు. ఈ దాడిలో గాయపడిన ఇద్దరు పోలీసు అధికారులు ఇంకా ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రార్థనా స్థలాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

## నరేగా పేరు మార్పు దురదృష్టకరం: శశిథరూర్

న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాజకీయ వివాదానికి దారితీసింది. దాదాపు రెండు దశాబ్దాలుగా అమలవుతున్న ఈ పథకం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రం యోచిస్తుండటంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఈ చర్యను దురదృష్టకరమని అభివర్ణించారు. కొంతకాలంగా మోదీ సర్కారు నిర్ణయాలకు మద్దతుగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత శశి థరూర్... ఈ విషయంలో మాత్రం కేంద్రాన్ని తప్పుబడుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయంపై సోమవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. "గ్రామ స్వరాజ్యం, రామరాజ్యం అనేవి గాంధీజీ చైతన్యంలో రెండు మూలస్తంభాలు. వాటి మధ్య ఎప్పుడూ వైరుధ్యం లేదు. గ్రామీణ పేదల కోసం ఉద్దేశించిన పథకానికి మహాత్ముడి పేరును తొలగించడం ద్వారా ఆయన వారసత్వాన్ని అగౌరవపరచొద్దు. ఆయన చివరి మాట 'రామ్'. లేని వివాదాన్ని సృష్టించి ఆయన స్ఫూర్తిని దెబ్బతీయవద్దు" అని థరూర్ పేర్కొన్నారు.

## పిల్లలకు డైపర్ల స్థానంలో ఈ-మ్యాట్

గౌహతి: అసోంలోని సోనిత్‌పూర్ జిల్లా, ధేకియాజులిలోని నేతాజీ విద్యా మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని హర్షిక అలమ్మయన్ ఒక వినూత్న ఆవిష్కరణతో రాష్ట్రానికి కీర్తి తెచ్చిపెట్టింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ) మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఇటీవల నిర్వహించిన 52వ జాతీయ బాలల సైన్స్ ఎగ్జిబిషన్ 2025లో హర్షిక అసోం నుంచి ప్రాతినిధ్యం వహించింది. ప్రస్తుత కాలంలో చిన్నారుల్లో డైపర్ల వినియోగం పెరిగింది. ఈ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లల్లో దద్దుర్లు, ఇతర ఇన్‌ఫెక్షన్ సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో హర్షిక ఒక ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపింది. చిన్నారులకు డైపర్ వేయాల్సిన అవసరం లేకుండా ఒక ఈ-మ్యాట్ పరికరాన్ని రూపొందించి ప్రదర్శించింది. ఇది సెన్సార్ల సహాయంతో పనిచేస్తుంది. ఈ-మ్యాట్‌ను పిల్లల పరుపు కింద పరచాలి. వారు మల, మూత్ర విసర్జన చేసినప్పుడు, అది తేమను గ్రహించి వెంటనే శబ్దం లేదా వైబ్రేషన్‌తో అప్రమత్తం చేస్తుంది. దీంతో వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టవచ్చు. ఈ మ్యాట్ సురక్షితమని, పునర్వినియోగానికి అనుకూలమని హర్షిక తెలిపింది. ఈ ప్రాజెక్టు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వాహకులను విశేషంగా ఆకట్టుకుంది.

## ముంబైలో ఇద్దరు టెర్రరిస్టులు అరెస్టు

ముంబై: ముంబైలో గ్యాంగ్‌స్టర్ నుంచి ఉగ్రవాదులుగా మారిన ఇద్దరిని... పంజాబ్ పోలీసులు, కేంద్ర సంస్థల సమన్వయంతో అరెస్టు చేశారు. వారికి నిషేధిత ఉగ్రవాద సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బీకేఐ)తో సంబంధాలున్నట్లు గుర్తించామని, వారిని అరెస్టు చేశామని డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు. అరెస్టు చేసిన వారిని గురుదాస్‌పూర్‌లోని వెరోక్ నివాసి సాజన్ మాసిహ్, అమృత్‌సర్‌లోని లాహోరి గేట్ నివాసి సుఖ్‌దేవ్ కుమార్ అలియాస్ మునీష్ బేడీగా గుర్తించారు. నిందితులిద్దరికీ నేర చరిత్ర ఉందని డీజీపీ తెలిపారు. వీరిపై హత్య, హత్యాయత్నం, ఆయుధాలు, పేలుడు పదార్థాల సరఫరా సంబంధిత కేసులు బటాలా, అమృత్‌సర్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైనట్లు వెల్లడించారు. నిందితులిద్దరికీ పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. నిందితులు దుబాయ్, అర్మేనియాతో సహా విదేశాల నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంజాబ్‌లోనూ ఉగ్రవాద కార్యకలాపాలకు సిద్ధమైనట్లు వెల్లడించారు. వారి అరెస్టు రాష్ట్ర పోలీసుల అతిపెద్ద విజయమని అభివర్ణించారు.

## 25 దేశాల్లో వీసా సర్వీస్ ఫీజు పెంపు: న్యూజిలాండ్

ఆక్లాండ్: భారత్ సహా 25 దేశాల్లో వీసా దరఖాస్తు కేంద్రాల్లో వసూలు చేసే సర్వీసు ఫీజును పెంచుతున్నట్లు న్యూజిలాండ్ ప్రకటించింది. ఈ పెంపు జనవరి 1 నుంచి కొన్ని కేంద్రాల్లో అమల్లోకి రానుంది. నిర్వహణపరమైన వ్యయాలు, ద్రవ్యోల్బణం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని న్యూజిలాండ్ ఇమ్మిగ్రేషన్ డిపార్ట్ మెంట్ వెల్లడించింది. న్యూజిలాండ్ వీసా కోసం ఇకముందు దరఖాస్తు చేసుకునేవారు ఈ మార్పును గమనించాలని సూచించారు. భారత్‌తో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, పాకిస్థాన్, శ్రీలంక, సింగపూర్, జపాన్ తదితర 25 దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. వీసా దరఖాస్తు ఫీజుకు అదనంగా వీసా అప్లికేషన్ కేంద్రాలు వసూలు చేసే ఫీజు ఉంటుందని ఆ దేశ ఇమ్మిగ్రేషన్ డిపార్టుమెంట్ పేర్కొంది. ఇటీవల చేపట్టిన సిస్టమ్ అప్‌గ్రేడ్‌ల కారణంగా ఫీజు పెంపు చేపట్టవలసి వచ్చిందని తెలిపింది. దరఖాస్తులు సమర్పించే ముందు, ఫీజు వివరాలను సరిచూసుకోవాలని సూచించింది.

## 'ఓట్ల చోరీ'తో ఇండియాకు సంబంధం లేదు: ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: ఓట్ల చోరీ అంశంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా షాకిచ్చారు. ఈ అంశంలో విపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో 'ఇండియా' కూటమిలోని నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. ఓట్ల చోరీ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతోందని, కానీ దీనితో ఇండియా కూటమికి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి పార్టీకి తన సొంత అజెండాను నిర్దేశించుకునే స్వేచ్ఛ ఉందని, ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లను కాంగ్రెస్ పార్టీ తన ప్రధానాంశాలుగా మార్చుకుందని గుర్తు చేశారు. ఏం చేయాలనే విషయమై వారి పార్టీకి తాము చెప్పలేమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఢిల్లీలో 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' పేరుతో బహిరంగ సభను నిర్వహించింది. సభ జరిగిన మరుసటి రోజునే ఒమర్ అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'ఇండియా' కూటమి పరిస్థితిపై ఆయన్ ఇటీవల కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఇండియా' కూటమి పరిస్థితి వెంటిలేటర్‌పై ఉన్నట్లుగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. బీహార్ ఎన్నికల విషయంలో విపక్ష కూటమి పట్టింపు లేనట్లుగా వ్యవహరించిందని ఆరోపించారు.

## మార్కెట్లకు స్వల్ప నష్టాలు


ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ట్రేడింగ్ ప్రారంభంలో నష్టపోయినప్పటికీ, ఆ తర్వాత కోలుకున్న సూచీలు చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 54.30 పాయింట్లు నష్టపోయి 85,213.36 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 19.65 పాయింట్లు కోల్పోయి 26,027.30 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, పవర్ గ్రిడ్ వంటి హెవీవెయిట్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మరోవైపు, హిందుస్థాన్ యూనిలీవర్, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్‌లో మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.12 శాతం పడిపోగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.21 శాతం లాభపడింది. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ ఆటో ఇండెక్స్ 0.91 శాతం, నిఫ్టీ ఫార్మా 0.4 శాతం నష్టపోయాయి. అయితే, నిఫ్టీ మీడియా సూచీ 1.79 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీ 0.69 శాతం మేర లాభపడ్డాయి. ప్రపంచ మార్కెట్ల ట్రెండ్‌పై స్పష్టత లేకపోవడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారని విశ్లేషకులు తెలిపారు. విదేశీ నిధుల తరలింపు, రూపాయి బలహీనత మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కంపెనీల త్రైమాసిక ఫలితాలు మార్కెట్ గతిని నిర్దేశిస్తాయని, అలాగే అమెరికా ద్రవ్యోల్బణం, నిరుద్యోగ గణాంకాల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారని నిపుణులు వివరించారు.


వయ్యారి చిత్రం


అవంతిక మిశ్రా

# రెండేళ్లు టాలీవుడ్ డామినేషనే!

బాలీవుడ్ ని సైతం దాటేసి ఇండియన్ బాక్సాఫీస్ పై టాలీవుడ్ డామినేషన్ చేస్తోంది. తెలుగు సినిమా పాన్ ఇండియా రిలీజ్ అంటే చాలు బీ టౌన్ ఆడియన్స్ కూడా పిచ్చెక్కిపోయే పరిస్థితి ఏర్పడింది. మరో రెండేళ్లు ఇలాగే డామినేషన్ కొనసాగేలా ఉంది పరిస్థితి. 2026 జనవరితో మొదలై ఇయర్ ఎండింగ్ వరకు భారీ సినిమాల రిలీజ్ లు ఉన్నాయి.











మొదటిగా మెగాస్టార్ చిరంజీవి నెక్స్ట్ ఇయర్ రెండు క్రేజీ సినిమాలతో రాబోతున్నారు. అందులో ఒకటి మన శంకర వరప్రసాద్ కాగా రెండోది విశ్వంభర. మన శంకరవరప్రసాద్ గారు తెలుగు రిలీజ్ మాత్రమే ఉన్నా విశ్వంభర మాత్రం పాన్ ఇండియా రిలీజ్ ఉంటుంది. ఇక నెక్స్ట్ బాలకృష్ణ గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో ఎన్‌బీకే 111 సినిమా వస్తుంది. ఈ సినిమాను కూడా నేషనల్ వైడ్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. వెంకటేష్ ఆదర్శ కుటుంబం సినిమా కూడా నెక్స్ట్ ఇయర్ సమ్మర్ కి రిలీజ్ షెడ్యూల్ చేసుకుంది. వీటితో పాటు ప్రభాస్ రాజా సాబ్ వచ్చే సంక్రాంతికి వస్తుండగా సెకండ్ హాఫ్ లో ఫౌజీ సినిమా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. సో నెక్స్ట్ ఇయర్ రెబల్ ఫ్యాన్స్ కి రెండు సినిమాల ఫీస్ట్ అందించే ప్లానింగ్ లో ఉన్నాడు ప్రభాస్. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ కూడా నెక్స్ట్ ఇయర్ సమ్మర్ కి రాబోతుంది. ఈ సినిమాతో మరోసారి గబ్బర్ సింగ్ రికార్డులను టార్గెట్ పెట్టుకున్నారు హరీష్ శంకర్. నాని ది ప్యారడైజ్, రామ్ చరణ్ పెద్ది కూడా నెక్స్ట్ ఇయర్ క్రేజీ సినిమాల లిస్ట్ లో ఉన్నాయి. రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమా సినిమా కూడా సంక్రాంతికి వస్తుంది. 2026 ఇలా ప్రతి సినిమా భారీ ప్లానింగ్ తో అంతకుమించిన అంచనాలతో వస్తుండగా 2027 బాక్సాఫీస్ హీట్ మరింత పెంచేలా స్టార్ సినిమాలు రాబోతున్నాయి. 2027 లో కూడా మెగాస్టార్ చిరంజీవి బాబీ కాంబో సినిమా రిలీజ్ ప్లానింగ్ ఉంది. రెబల్ స్టార్ ప్రభాస్ సందీప్ వంగ కాంబినేషన్ లో వస్తున్న స్పిరిట్ కూడా అదే సంవత్సరం రాబోతోంది. సూపర్ స్టార్ మహేష్ రాజమౌళి కాంబోలో తెరకెక్కుతున్న వారణాసి సినిమా 2027 సమ్మర్ రిలీజ్ అనే టాక్ ఉంది. ఈ సినిమాతో ఇంటర్నేషనల్ లెవెల్ లో ఆడియన్స్ ఎంగేజ్ చేసే ప్లానింగ్ లో ఉ న్నారు జక్కన్న. ఇక వీటితో పాటు పెద్ది పూర్తి కాగానే సుకుమార్ తో రామ్ చరణ్ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందని తెలుస్తుండగా ఆ సినిమాను 2027 రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా కూడా 2027 లో రిలీజ్ అవుతుంది. ఈ సినిమాలతో పాటు అట్లీ, అల్లు అర్జున్ కాంబో సినిమా కూడా అదే ఏడాది రిలీజ్ ఫిక్స్ చేశారు. సో 2027 ప్రతి స్టార్ తమ పాన్ ఇండియా సినిమాలతో బాక్సాఫీస్ రేసులో దిగుతున్నారు. కచ్చితంగా నేషనల్ వైడ్ గా ఈ సినిమాల గురించి కచ్చితంగా ఒక రేంజ్ బజ్ ఏర్పడే ఛాన్స్ ఉంటుంది. 2027 తెలుగు సినిమాల బాక్సాఫీస్ సౌండ్ వరల్డ్ వైడ్ వినిపించబోతోంది.



## తెలివిగా గేమ్ ఆడుతున్న రుక్మిణి

కాంతార చాప్టర్ 1లో నటించింది రుక్మిణి వసంత్. యువరాణి కనకవతి అనే ప్రతినాయక పాత్రతో ఈ బ్యూటీ ఆశ్చర్యపరిచింది. తన కెరీర్ లో తొలి పాన్ ఇండియా హిట్ ఇచ్చిన కిక్కును ఇప్పటికీ ఆస్వాదిస్తున్నానని చెబుతోంది ఈ బ్యూటీ. తెలుగు, కన్నడ చిత్రసీమలకు సుపరిచితురాలైన ఈ నటి ఇప్పుడు బాలీవుడ్ లోను ఆరంగేట్రం చేయడానికి సిద్ధమవుతోంది. అదే సమయంలో తమిళంలోను క్రేజీ ఆఫర్లకు ఓకే చెబుతోంది. అయితే బాలీవుడ్ లో నటించాలనే తన కసిని రుక్మిణి ఇప్పుడు బయటపెట్టింది. తనకు హిందీ భాషతో ఉన్న అనుబంధం కారణంగా బాలీవుడ్ లో నటిస్తానని వెల్లడించింది. 'హిందీ నాకు బాగా తెలిసిన భాష. అందువల్ల ఈ భాషలో నిరూపించుకోవాలని ఉంది!' అని తెలిపింది. హిందుస్థాన్ టైమ్స్ ఇంటర్వ్యూలో రుక్మిణి వసంత్ మాట్లాడుతూ ఇలా అన్నారు. 'చాలా చర్చలు జరుగుతున్నాయి. నేను ఉత్సాహంగా ఉన్నాను. హిందీ నాకు చిన్నప్పటి నుండి పరిచయం ఉన్న భాష.. ఎప్పుడూ హిందీ సినిమాలతో పరిచయం ఉండేది.



## నేనూ అవకాశవాదినే

సినిమా అవకాశాలు అందుకోవడంలో తాను కూడా ఓ గొప్ప అవకాశ వాదినని అంటోంది నస్రత్ భరూచా. నటన పరంగా రాణించాలంటే కొన్ని విషయాల్లో ఓపెన్ గా ఉ ండటం ఎంతో ఉత్తమ మైనదిగా తెలిపింది. నోరు తెరిచి అడగకపోతే ఒక్కోసారి వచ్చే అవకాశాలు కూడా చేజారిపోతాయంది. అందుకే అవకాశ వాదిగా ఉండటం చెడ్డ విషయం కాదంది. కానీ ఆ మార్గంలో వెళ్లాలని అని నిర్ణయం తీసుకున్నప్పుడు మాత్రం తీసుకునే చర్యలు మాత్రం బాధ్యతాయుతంగా ఉండాలి అంది. తనకు ఇవన్నీ ఒక్క రోజు లో రాలేదని ఇండస్ట్రీలో కొంత కాలం కొనసాగిన అనతరం..ఎదురైన అనుభవాల నేపథ్యం నుంచే తాను తెలుసుకున్నట్లు గుర్తు చేసుకుంది.



## రుహానీ శర్మ అందాల విందు

'చి ల సౌ' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రుహానీ శర్మ, మొదటి సినిమాతోనే మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ సినిమాలో చాలా పద్ధతిగా, సంప్రదాయంగా కనిపించిన ఈ భామ, సోషల్ మీడియాలో మాత్రం దానికి పూర్తి భిన్నంగా ఉంటారు. నిత్యం గ్లామరస్ ఫొటోషూట్లతో కుర్రాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తుంటారు. లేటెస్ట్ గా రుహానీ శర్మ ఇన్‌స్టాలో షేర్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సాధారణంగా హీరోయిన్లు గ్లామర్ డోస్ పెంచడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ రుహానీ మాత్రం చాలా సింపుల్గా ఉంటూనే, తనలోని గ్లామర్ ని ఎలివేట్ చేయడంలో దిట్ట. సినిమాల్లో అవకాశాల విషయం పక్కన పెడితే, సోషల్ మీడియాలో మాత్రం ఆమెకు మంచి క్రేజ్ ఉంది. ఆమె పోస్ట్ పెట్టగానే లైకులు, కామెంట్ల వర్షం కురుస్తుంటుంది. ప్రస్తుతం రుహానీ శర్మ తెలుగుతో పాటు హిందీ ప్రాజెక్టులపై కూడా దృష్టి సారించారు. 'సైంధవ్' వంటి చిత్రాల్లో కీలక పాత్రలో మెరిసిన ఆమె, మరిన్ని మంచి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు.

## ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి!



ఎంచుకునే సినిమాలే సాయి పల్లవికి ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానాన్ని అందించాయి. ఎక్స్‌పోజింగ్ కు ఆమడ దూరంలో ఉండే సాయి పల్లవి ఎంతో సహజంగా ఉంటూ అద్భుతమైన నటనతో ఆకట్టుకుంటూనే, అంతకుమించిన డ్యాన్సులతో యూత్ ను అలరిస్తుంటారు. అందుకే ఆమెతో సినిమా చేయడానికి ఎవరైనా ఎదురుచూస్తారు. కానీ ఆమె మాత్రం వచ్చిన అవకాశాలన్నింటినీ ఒప్పుకోకుండా తన మనసుకు నచ్చే కథలను మాత్రమే ఎంచుకుంటూ ఉంటారు. అందుకే సాయి పల్లవి నటించిన సినిమాలు ఫ్లాప్ అయ్యాయేమో కానీ నటిగా ఆమె మాత్రం ఎప్పుడూ ఫెయిలవలేదు. అయితే ఇప్పుడు సాయి పల్లవి ని ఓ బయోపిక్ కోసం మేకర్స్ సంప్రదించినట్టు తెలుస్తోంది. ప్రముఖ గాయని, లెజెండరీ సింగర్ ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్ ను సాయి పల్లవితో చేయాలని భావించి ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ఆమెను సంప్రదించారని తెలుస్తోంది.



# ఆక్షన్..
# యాక్షన్ నేడే




ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఐపీఎల్ 2026 మినీ వేలానికి సమయం ఆసన్నమైంది. మరికొద్ది గంటల్లో అబుదాబిలోని ఎతిహాద్ స్టేడియం వేదికగా ఈ మినీ ఆక్షన్‌కు తెరలేవనుంది. ఈసారి 10 జట్లలో గరిష్టంగా ఖాళీగా ఉన్న 77 స్థానాల కోసం 359 మంది ఆటగాళ్లు పోటీపడుతున్నారు. ఇందులో 110 మంది అంతర్జాతీయ ఆటగాళ్లు ఉండగా.. 31 మందికి అవకాశం దక్కనుంది. 10 ఫ్రాంచైజీలు రూ. 237.55 కోట్లు ఖర్చు చేయనున్నాయి. భారత కాలమానం ప్రకారం మంగళవారం(డిసెంబర్ 16) మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభం కానుంది. జియో హాట్‌స్టార్‌తో పాటు స్టార్ స్పోర్ట్స్ ఛానెల్స్‌లో వేలం ప్రత్యక్ష ప్రసారం కానుంది.

**ఫ్రాంచైజీల వారీగా పర్స్ వాల్యూ**

1. కోల్‌కతా నైట్‌రైడర్స్:రూ.64.3 కోట్లు
2. చెన్నై సూపర్ కింగ్స్: రూ. 43.4 కోట్లు
3. సన్‌రైజర్స్ హైదరాబాద్: రూ.25.5 కోట్లు
4. లక్నో సూపర్ జెయింట్స్: రూ.22.95 కోట్లు
5. ఢిల్లీ క్యాపిటల్స్: రూ.21.8 కోట్లు
6. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: రూ.16.4 కోట్లు
7. రాజస్థాన్ రాయల్స్: రూ.16.05 కోట్లు
8. గుజరాత్ టైటాన్స్: రూ.12.9 కోట్లు
9. పంజాబ్ కింగ్స్: రూ.11.5 కోట్లు
10. ముంబై ఇండియన్స్: రూ.2.75 కోట్లు

**ఫ్రాంచైజీల వారిగా కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల సంఖ్య**

1. కోల్‌కతా నైట్‌రైడర్స్: 13
2. చెన్నై సూపర్ కింగ్స్: 9
3. సన్‌రైజర్స్ హైదరాబాద్: 10
4. లక్నో : 6
5. ఢిల్లీ క్యాపిటల్స్: 8
6. రాయల్ ఛాలెంజర్స్ :8
7. రాజస్థాన్ రాయల్స్: 9
8. గుజరాత్ టైటాన్స్: 5
9. పంజాబ్ కింగ్స్: 4
10. ముంబై ఇండియన్స్: 5

## పతీరణాను సీఎస్కే కొనొద్దు

ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) ఫ్రాంచైజీకి భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ కీలక సలహా ఇచ్చాడు. ఎట్టిపరిస్థితుల్లో మతీషా పతీరణాను సీఎస్‌కే తిరిగి కొనుగోలు చేయకూడదని సూచించాడు. అతనికి బదులుగా సౌతాఫ్రికా పేసర్ అన్రిచ్ నోర్జ్‌ను తీసుకోవాలని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 మినీ వేలం నేపథ్యంలో అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ తమిళ్ ఛానెల్‌లో సీఎస్‌కే మాజీ క్రికెటర్ బద్రీనాథ్‌తో కలిసి శ్రీకాంత్ మాట్లాడాడు. మతీషా పతీరణాకు బదులు అన్రిచ్ నోర్జ్‌ను తీసుకుంటే సీఎస్‌కే బౌలింగ్ విభాగం మరింత పటిష్టంగా మారుతుందని చెప్పాడు. 'నేను అయితే పతిరణాను మళ్లీ తీసుకోవద్దనే చెబుతాను. పతిరణాకు బదులు నోర్జ్‌ను ఎంచుకోవాలి. అయితే నోర్జ్‌ను కూడా కాస్త తీర్చిదిద్దాలి. అతని వేగవంతమైన బౌలింగ్ సామర్థ్యం సీఎస్‌కేకు కలిసి వస్తుంది. జాకబ్ డఫీ వంటి విదేశీ ఫాస్ట్ బౌలర్‌ను కూడా సీఎస్‌కే తీసుకునే ప్రయత్నం చేయాలి. ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్ ఉన్నా.. 14 మ్యాచ్‌ల పాటు వీరిపై నమ్మకం ఉంచలేం.'అని శ్రీకాంత్ చెప్పుకొచ్చాడు.







# ఐపీఎల్ వేలంలో నయా రూల్స్

ఐపీఎల్ మినీ వేలం సందర్భంగా బీసీసీఐ ఓ కొత్త 'టై-బ్రేకర్' నియమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కొత్త రూల్ క్రికెట్ అభిమానులలో ఉత్సాహాన్ని పెంచే అవకాశం ఉంది. ఒకే ఆటగాడి కోసం రెండు లేదా అంతకంటే ఎక్కువ జట్లు ఒకే బిడ్‌పై నిలిచిపోయినప్పుడు, ఈ నియమం అమలులోకి వస్తుంది. గతంలో కీరన్ పొలార్డ్(2010), రవీంద్ర జడేజా(2012) వంటి ఆటగాళ్లను పెద్ద బిడ్డింగ్ యుద్ధాల అనంతరం రహస్య బిడ్ ద్వారా జట్లు తమ సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు ఆ తరహా క్లిష్టమైన హై-లెవెల్ టైలను పరిష్కరించడానికి ఈ కొత్త రూల్ రూపొందించబడింది. ఐపీఎల్ 2026 మినీ వేలంలో కొనుగోలు చేసేందుకు కేవలం కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల వద్ద మాత్రమే ఎక్కువ డబ్బు(పర్స్‌లో బ్యాలెన్స్) ఉంది. మిగిలిన 7 జట్ల పర్స్ బ్యాలెన్స్ ఒకదానికొకటి దగ్గరగా ఉంది. ఈ కారణంగా ఆస్ట్రేలియాకు చెందిన కామెరాన్ గ్రీన్, ఇంగ్లాండ్‌కు చెందిన లియామ్ లివింగ్‌స్టోన్ వంటి స్టార్ విదేశీ ఆటగాళ్ల కోసం గట్టి పోటీ ఉండే అవకాశం ఉంది. ముంబై ఇండియన్స్ కేవలం రూ. 2.75 కోట్ల పర్స్‌తో ఈ బిడ్డింగ్‌లో పాల్గొనడం కష్టం.

### కొత్త టై-బ్రేకర్ రూల్ ఏమిటి?

ఒకే బిడ్‌పై రెండు లేదా అంతకంటే ఎక్కువ జట్లు నిలిచిపోయినప్పుడు సమస్యను పరిష్కరించడానికి బీసీసీఐ అందించిన సరళమైన పరిష్కారం ఇది. ఒకే బిడ్‌పై జట్లు లాక్ అయినప్పుడు, బోర్డు వారికి ఒక 'టై-బ్రేకర్ ఫామ్' అందిస్తుంది. ఈ ఫామ్‌లో ఫ్రాంచైజీలు భారతీయ రూపాయల్లో ఒక 'రహస్య బిడ్' మొత్తాన్ని రాయాల్సి ఉంటుంది. ఈ 'రహస్య బిడ్' మొత్తాన్ని మాత్రం ఆటగాడికి చెల్లించరు. ఇది బీసీసీఐకి చెల్లించాల్సిన మొత్తం. అందుకే దీనిని ఇప్పటికీ 'టై-బ్రేకర్ బిడ్' అని పిలుస్తారు.రహస్య బిడ్‌లో అత్యధిక మొత్తం రాసిన జట్టు ఆ ఆటగాడిని గెలుచుకుంటుంది. విజేత జట్టు ఆ 'రహస్య బిడ్' మొత్తాన్ని డిసెంబర్ 16 వేలం తేదీ నుండి 30 రోజులలోపు భారతీయ రూపాయలలో బీసీసీఐకి చెల్లించాల్సి ఉంటుంది.

### ఆటగాడి ధర ఎంత ఉంటుంది?

కీలక విషయమేమిటంటే.. ఈ ప్రక్రియలో ఆటగాడి తుది ధర మాత్రం మారదు. ఆటగాడికి చెల్లించాల్సిన ధర, రెండు జట్లు ఏ బిడ్‌పై అయితే లాక్ అయ్యాయో (చివరిగా నిర్ణయించిన వేలం మొత్తం) అదే ఉంటుంది. గెలిచిన రహస్య బిడ్ మొత్తం కేవలం టై-బ్రేక్ కోసం ఉపయోగించబడుతుంది, బీసీసీఐకి అదనపు ఆదాయంగా వెళ్తుంది.




## సంజూ తట్టుకోలేక పోతున్నాడు: కైఫ్

టీ20 ఫార్మాట్‌లో పేలవ ప్రదర్శన కనబరుస్తున్న టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను జట్టు నుంచి తప్పించాలని మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ డిమాండ్ చేశాడు. గాయం సాకుతో గిల్‌ను తప్పించే సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డాడు. శుభ్‌మన్ గిల్‌కు వరుసగా అవకాశాలు ఇవ్వడాన్ని సంజూ శాంసన్ తట్టుకోలేకపోతున్నాడని తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా చెప్పుకొచ్చాడు. 'పరిస్థితులను మీ నియంత్రణలో ఉంచుకోవాలంటే శుభ్‌మన్ గిల్‌ను తప్పిస్తున్నామనే పదాన్ని ఉపయోగించకండి. అందుకు బదులుగా అతనికి విశ్రాంతి ఇస్తున్నామని, లేదా మరో ఆటగాడికి అవకాశం ఇవ్వాలనుకుంటున్నామని చెప్పండి. ఏది ఏమైనా చివరి రెండు టీ20ల్లో టీమిండియా శుభ్‌మన్ గిల్ స్థానంలో మరో ఆటగాడిని ఆడించాలి. ముఖ్యంగా సంజూ శాంసన్‌ను ఆడించాలి. అతనికి ఆ హక్కు ఉంది. ఇప్పటికే సంజూ..'గిల్ ఏడాది నుంచి ఆడుతున్నాడు. కానీ నేను 2-3 మ్యాచ్‌లు విఫలమైతేనే పక్కనపెట్టారు.'అని అనుకుంటున్నాడు. తుది జట్టులో అవకాశాల విషయంలో ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాళ్లకు ఒకటి రెండు అవకాశాలు ఎక్కువగా లభిస్తాయి. కానీ శుభ్‌మన్ గిల్ ఇప్పటికే చాలా ఇన్నింగ్స్‌లు ఆడాడు. అతని వైఫల్యం గురించి ఇప్పుడే మాట్లాడటం లేదు. చాలా రోజులుగా చర్చిస్తున్నాం. కాబట్టి గిల్ విషయంలో టీమ్‌మేనేజ్‌మెంట్ ఒక నిర్ణయం తీసుకోవాలి. గిల్‌ను తప్పించే సమయం ఆసన్నమైంది' అని మహమ్మద్ కైఫ్ తెలిపాడు.

## ఇంగ్లండ్‌కు చావోరేవో

యాషెస్ సిరీస్‌లో చతికిలపడుతున్న ఇంగ్లండ్ చావోరేవో పోరుకు సిద్ధమవుతోంది. పెర్త్, బ్రిస్బేన్‌లో దారుణంగా ఓడిన పర్యాటక జట్టు మూడో మ్యాచ్‌లో గెలిచి తీరాలనే కసితో ఉంది. అడిలైడ్ వేదికగా బుధవారం మొదలయ్యే మూడో టెస్టులో గెలిస్తేనే సిరీస్‌లో నిలిచేందుకు అవకాశముంది. దాంతో.. ఆస్ట్రేలియాకు షాకిచ్చి పరువు కాపాడుకోవాలనుకుంటున్న బెన్ స్టోక్స్ సేనకు ఈ మ్యాచ్ కోసం కీలకమార్పు చేసింది. పేస్ బౌలింగ్ యూనిట్‌లో గస్ అట్కిన్సన్ స్థానంలో జోష్ టంగ్‌ను తీసుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై యాషెస్ సిరీస్‌లో సమిష్టి వైఫల్యంతో కంగుతిన్న ఇంగ్లండ్ అడిలైడ్‌లో అద్భుతం చేయాలనుకుంటోంది. బజ్‌బాల్ ఆటను నమ్ముకుని చేతులు కాల్చుకున్న బెన్ స్టోక్స్ సేన ఈసారి సంప్రదాయ ఆటతోనే ఆసీస్‌కు చెక్ పెట్టాలని భావిస్తోంది. మూడో టెస్టుకు రెండు రోజులే ఉండడంతో ఆనవాయితీ ప్రకారం ముందుగానే ఇంగ్లండ్ బోర్డు తుది జట్టును ప్రకటించింది. గత రెండు టెస్టులు ఆడిన వాళ్లను అలానే కొనసాగించిన ఈసీబీ.. పేసర్ అట్కిన్సన్ బదులు యంగ్ సంచలనం జోష్ టంగ్‌ను ఎంపిక చేసింది.




## దేశవాళీ ఆడి తీరాల్సిందే

### రో-కో సహ అందరికీ ఒకటే రూల్.. తేల్చి చెప్పిన బీసీసీఐ

అంతర్జాతీయ మ్యాచ్‌లు లేనప్పుడు దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందేనని స్పష్టం చేసిన భారత క్రికెట్ నియంత్రణ మండలి ఈ విధానాన్ని పక్కాగా అమలు చేయాలనుకుంటోంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు జట్టులోని సీనియర్లను డొమెస్టిక్‌లో ఆడాలని కోరుతోంది బీసీసీఐ. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ ముగిశాక వారానికే విజయ్ హజారే ట్రోఫీ షురూ కానుంది. వచ్చే వన్డే వరల్డ్ కప్ లక్ష్యంగా పెట్టుకున్న రో-కో ఈట్రోఫీకి అందుబాటులో ఉంటామని ఇప్పటికే తమ రాష్ట్ర క్రికెట్ సంఘాలకు సమాచారమిచ్చారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, బీసీసీఐ ఇటీవల కాలంలో వరుసగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. టెస్టు, వన్డే సారథిగా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేసిన అగార్కర్ బృందం.. టీమిండియా క్రికెటర్లు దేశవాళీలో ఆడాల్సిందేనని కొత్త మెలిక పెట్టింది. దాంతో.. పదేహేనళ్లుగా డొమెస్టిక్ టోర్నీలు ఆడని మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు సైతం 'మేము రెఢీ' అని చెప్పేశారు. రాబోయే విజయ్ హజారే ట్రోఫీ కోసం తమను ఎంపిక చేయాలని వీరు ఇప్పటికే తమ రాష్ట్ర బోర్డులకు సమాచారమిచ్చారు. వీరితో పాటు సీనియర్లను కూడా ఒకట్రెండ్ మ్యాచ్‌లు ఆడించాలని భావిస్తున్న బీసీసీఐ ఈ విషయాన్ని అజిత్ అగార్కర్ ద్వారా వారికి చేరవేసింది.



# ప్రపంచ పెట్టుబడిదారీ సంస్థగా చైనా



ప్రపంచంలో ఉన్న దేశాల దాదాపు 80 శాతం దేశాలు తమ అభివృద్ధి కార్యక్రమాలు, వాణిజ్య అవసరాలు, ప్రత్యేక ప్రాజెక్టులకు కావలసిన రుణాలు, గ్రాంట్లను ఈ రోజుల్లో చైనా నుంచే పొందుతున్నాయి. గమనించదగ్గ అంశం ఏంటంటే, ఈ రుణాల వ్యవస్థలో అమెరికానే అత్యధిక లాభం పొందుతున్న దేశం. అమెరికాలో మాత్రమే వివిధ రంగాలకు చెందిన ప్రాజెక్టుల కోసం సుమారు 200 బిలియన్ డాలర్ల రుణాన్ని చైనా బ్యాంకులు అందజేశాయి. వర్జీనియాలోని విలియం, విలియంబర్గ్- మేరీ కళాశాలకు చెందిన పరిశోధనా సంస్థ ఎయిడ్ డేటా ఇటీవల విడుదల చేసిన సమాచారం చైనా రుణాల విస్తృతి, దాని వ్యూహాత్మక ఉపయోగం, దేశాలపై పడుతున్న ప్రభావంపై ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

పేద దేశాలకు మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సాయిపడే దేశంగా పేరు తెచ్చుకున్న చైనా, గత దశాబ్దంలో ఆ పాత్ర నుంచి క్రమంగా దూరమై అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వాణిజ్య ప్రయోజనాలు ప్రధానంగా దృష్టి పెట్టిన రుణాల వైపు మళ్లినట్లు ఈ నివేదిక చెబుతోంది. అమెరికన్ కంపెనీలకు ఇచ్చిన రుణాలలో 75% పూర్తిగా వ్యాపార ప్రయోజనాల కోసం, కేవలం 7% మాత్రమే అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇచ్చినవి కావడం దీనికి ఉదాహరణగా చూపబడింది. చైనా తొలుత ఆర్థిక బలహీనత ఉన్న దేశాల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చింది. ఈ దిశలోనే అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2013లో బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ( బి ఆర్ ఐ) ను ప్రారంభించారు. ఆసియా%-%యూరప్ అనుసంధాన మార్గాలు, ఇంధనం, మౌలిక వసతుల అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా బి ఆర్ ఐ రూపొందింపబడ్డా, ప్రపంచ ఆర్థిక సంక్లిష్టతల నేపథ్యంలో చైనా తరువాత ఈ పథకంలో పెట్టుబడులను తగ్గించింది. ఒకప్పుడు బి ఆర్ ఐ ప్రాజెక్టులకు 75% వరకు రుణాలు ఇస్తున్న చైనా, ఇప్పుడు ఆ శాతాన్ని 25% కు తగ్గించింది.

2000%-%2023 మధ్య కాలంలో ప్రపంచ దేశాలకు చైనా అందించిన రుణాలు, గ్రాంట్లు కలిపి రెండు ట్రిలియన్ డాలర్లను దాటాయి. ఇందులో అమెరికన్ కంపెనీలకు మాత్రమే 2,500 ప్రాజెక్టుల కోసం 200 బిలియన్ డాలర్ల రుణాలు మంజూరు చేయడం గమనార్హం. ఈ మొత్తంలో 95% రుణాలు చైనా సెంట్రల్ బ్యాంక్, ఇతర ప్రభుత్వ బ్యాంకుల నుంచే రావడం చైనాది ఎంత భారీ స్థాయిలో సమన్విత ఆర్థిక వ్యూహమో చూపిస్తుంది. ప్రపంచంలోని 217 దేశాలు, ప్రాంతాలలో 179 దేశాలు ఏదో ఒక రూపంలో చైనా నుంచి రుణాన్ని పొందాయి. తాజా గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు చైనా ఇతర దేశాలకు 140 బిలియన్ డాలర్ల తాజా రుణాలు కూడా ఇచ్చింది. అమెరికా తర్వాత రష్యా, ఆస్ట్రేలియా చైనా రుణాలు ఎక్కువగా తీసుకున్న దేశాలుగా నిలిచాయి. గత రెండు దశాబ్దాల్లో రష్యన్ సంస్థలు 172 బిలియన్ డాలర్లు, ఆస్ట్రేలియా సంస్థలు 130 బిలియన్ డాలర్లు పొందాయి. యూరోపియన్ యూనియన్‌లోని 27 సభ్య దేశాలు కలిపి 1,800 ప్రాజెక్టులకు 161 బిలియన్ డాలర్ల రుణం తీసుకున్నాయి.

భారతదేశంలోని సంస్థలు కూడా చైనా బ్యాంకుల నుంచి రుణాలు, గ్రాంట్ల రూపంలో 11.1 బిలియన్ డాలర్లు పొందినట్లు ఎయిడ్ డేటా తెలిపింది. 2000లో అమెరికాకు ఇచ్చిన రుణం కేవలం 320 మిలియన్ డాలర్లు ఉండగా, 2023 నాటికి అది 19 బిలియన్ డాలర్లకు పెరగడం చైనా%-%అమెరికా ఆర్థిక సంబంధాల లోతును ప్రతిబింబిస్తోంది. విదేశీ సంస్థల విలీనాలు, సేకరణల విషయంలో కూడా చైనా 80% విజయాన్ని సాధించింది. అనేక దేశాలలో విదేశీ రుణాలను పర్యవేక్షించే వ్యవస్థలు బలహీనంగా ఉండటం చైనా వ్యూహాలకు అనుకూలంగా పనిచేసింది. ముఖ్యంగా షెల్ కంపెనీలు, అంతర్జాతీయ బ్యాంకింగ్ సిండికెట్లు, అనుబంధ సంస్థల వ్యవస్థ ద్వారా చైనా తన ఆర్థిక విస్తరణను మరింత బలంగా కొనసాగించిందని పరిశోధన సంస్థ స్పష్టంచేసింది. 2.చైనా రుణాల వ్యవహారం ఇప్పుడు సాధారణ ఆర్థిక లావాదేవీ కాదు, భౌగోళిక-రాజకీయ ఆయుధంగా మారుతోంది. ఒక వైపు అమెరికా ఇతర దేశాలకు "చైనా అప్పులు తీసుకోకండి, నుండి జాగ్రత్త" అని హెచ్చరిస్తుంటే, మరో వైపు అదే అమెరికా చైనా నుంచి 200 బిలియన్ డాలర్లకుపైగా రుణాలు స్వీకరించడం తీవ్రమైన వ్యూహాత్మక విరుద్ధతను చూపుతోంది. చైనా మొదట పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మౌలిక వసతుల కోసం భారీగా అప్పులు ఇచ్చి వాటిపై రాజకీయ ప్రభావాన్ని పెంచుకునే ప్రయత్నం చేసిందిబీ కానీ ఇప్పుడు దాని లెండింగ్ మోడల్ క్రమంగా అధిక ఆదాయ దేశాలు, వ్యూహాత్మక సెక్టార్లు, టెక్నాలజీ కంపెనీలు వైపుకు మలిచింది.

ఇది సాదాసీదా ఆర్థిక విస్తరణ కాదుబీ సెమీ కండక్టర్లు, రోబోటిక్స్, బయోటెక్, ఏఐ డేటా సెంటర్లు, పైప్‌లైన్లు, విమానాశ్రయ టెర్మినల్స్ వంటి క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హైటెక్ ఆస్తులపై పరోక్ష పట్టు సాధించే కదలిక. ఈ లావాదేవీల్లో పెద్ద శాతం షెల్ కంపెనీలు, ఆఫ్‌షోర్ ఫైనాన్షియల్ సెంటర్లు వంటివి) ద్వారా తిరుగుతున్నాయనేది మరింత ఆందోళనకరంబీ ఇది పారదర్శకతను తగ్గించడమే కాకుండా, ఆర్థిక ఆధిపత్యాన్ని "కంటికి కనిపించకుండా" అమలు చేసే వ్యవస్థగా మారుతుంది. ఒకప్పుడు బి ఆర్ ఐ పేరుతో గ్లోబల్ సౌత్ దేశాలలో రోడ్లు, పోర్టులు, పవర్ ప్లాంట్లు, రైల్వేలు కట్టే పని మీద దృష్టి పెట్టిన చైనా, ఇప్పుడు అప్పులలో 76% వరకు రిచ్, అప్పర్ మిడిల్ ఆదాయ దేశాలకు మళ్లించడం ద్వారా ప్రమాదాన్ని విభిన్నంగా పంచుకుంటూ, అదే సమయంలో ఎక్కువ రాబడి, ఎక్కువ వ్యూహాత్మక లాభం ఉన్న మార్కెట్లను టార్గెట్ చేస్తోంది. దీంతో పేద దేశాలు "ఓవర్‌డెబ్టెడ్, డిస్ట్రెస్డ్ బారోవర్లు"గా మిగిలి, వాటికి రీషెడ్యూలింగ్, రిస్క్యూ ప్యాకేజీల రూపంలో కొత్త చైనీస్ చర్చల వలల్లో చిక్కుతున్నాయని యాడ్ డేటా ఇతర నివేదికలు కూడా సూచిస్తున్నాయి. ఈ క్రమంలో, అమెరికా, యూరోప్ వంటి దేశాలు పబ్లిక్‌గా చైనాను సవాలు చేస్తూనే, ప్రైవేట్ కార్పొరేట్ స్థాయిలో చైనా మూలధనంపై ఆధార పడుతున్న వాస్తవం గ్లోబల్ ఫైనాన్స్‌లో ఒక పెద్ద విరోధాభాసం. ఫ్యూచర్ 500 కంపెనీలు కూడా చైనా బ్యాంకుల వర్కింగ్ క్యాపిటల్, రివాల్వింగ్ క్రెడిట్ ఫెసిలిటీలను వినియోగించుకోవడం, రెండు బ్లాకుల మధ్య "పోరాటం-సహకారం" మిశ్రమ స్వభావాన్ని చూపుతుంది. దీని వలన, వచ్చే దశాబ్దంలో సాంకేతిక స్వావలంబన, నేషనల్ సెక్యూరిటీ, డేటా సౌవిరన్‌టీ లాంటి అంశాలపై పెద్ద రాజకీయ చర్చలు మరింత పెరగడం ఖాయం. అభివృద్ధి చెందుతున్న దేశాల కోణం నుంచి చూస్తే, చైనా రుణాలు ఒకవైపు ఇన్ఫ్రాస్ట్రక్చర్ గ్యాప్ తగ్గించే అవకాశం కల్పిస్తే, మరోవైపు తీర్చలేని అప్పులు, కరెన్సీ రిస్క్, పొలిటికల్ కండిషనాలిటీస్ రూపంలో దీర్ఘకాలిక గండాలు పెంచుతున్నాయి. రుణ ఒప్పందాల్లో గోప్యతా నిబంధనలు, అర్బిట్రేషన్ క్లాజులు, కోలాటరల్‌గా నేచురల్ రిసోర్సులు లేదా పోర్టు హక్కులు ఇచ్చే షరతులు ఉండటం వల్ల, సార్వభౌమ నిర్ణయాధికారంపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉంది.

భారతదేశం సందర్భంలో చైనా రుణాలు నేరుగా అంత పెద్ద స్థాయిలో లేనప్పటికీ, ఆసియా-ఆఫ్రికా ప్రాంతంలో చైనా ఫైనాన్స్ ఆధిపత్యం వల్ల భారత విదేశాంగ%-%ఆర్థిక వ్యూహాలు మరింత సంక్లిష్టం అవుతున్నాయి. సౌత్ ఆసియా, హిందూ మహాసముద్రం ప్రాంతంలో చైనా ఫైనాన్స్ ద్వారా ఏర్పడుతున్న పోర్టులు, రోడ్లు, ఇంధన ప్రాజెక్టులు ప్రాంతీయ శక్తి సమీకరణాన్ని మార్చే సామర్థ్యం కలిగి ఉన్నాయి. అదే సమయంలో, జి 7 పార్ట్నర్‌షిప్ ఆఫ్ గ్లోబల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్మెంట్ వంటి ప్రత్యామ్నాయ ప్రణాళికలు తెచ్చి చైనాకు పోటీ ఇవ్వాలని చూస్తున్నా, ఫైనాన్స్ వాల్యూమ్, వేగం, రిస్క్ టాలరెన్స్ పరంగా చైనా ఇప్పటికీ ముందంజలో ఉందని తాజా డేటా సూచిస్తుంది. మొత్తానికి, లెక్కలు చూపుతున్న నిజమైన కథ ఇది: చైనా ఇప్పుడు కేవలం "పేద దేశాలకు లోన్లు ఇచ్చే బిగ్ బ్రదర్" కాదుబీ ప్రపంచంలోనే అత్యంత పెద్ద క్రెడిటర్‌గా, రిచ్ దేశాల స్ట్రాటజిక్ రంగాల్లో లోతైన ఆర్థిక వేర్లు వేస్తున్న శక్తి. అభివృద్ధి, వాణిజ్యం, భద్రత - ఈ మూడు రంగాల మధ్య చైనా రుణాలు వేసిన ఈ సైలెంట్ నెట్‌వర్క్‌ను అర్థం చేసుకోకుండా, భవిష్యత్ గ్లోబల్ పొలిటికల్ ఎకానమీని అర్థం చేసుకోవడం కష్టమే.

# ఒక జాతి విముక్తికి మన సాయం



**డిసెంబర్ 16, 1971.. చరిత్ర పుటల్లో ఓ సరికొత్త అధ్యాయం లిఖించబడిన రోజు. భారత సైన్యం అసాధారణ పరాక్రమం ముందు తలవంచి, పాకిస్తాన్ సేనలు ఢాకాలో లొంగిపోయిన పవిత్ర ఘట్టం. ఈ రోజును మనం విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నాం. ఇది కేవలం ఒక సైనిక విజయం కాదుబీ ఇది మానవ హక్కుల పరిరక్షణకు, ఒక అణచివేతకు గురవుతున్న జాతికి విముక్తి కల్పించడానికి, అఖండ భారతదేశం తన మానవీయత, సైనిక శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన చారిత్రక సందర్భం. 1971 యుద్ధం యొక్క మూలాలు తూర్పు పాకిస్తాన్‌లో (నేటి బంగ్లాదేశ్) నెలకొన్న తీవ్ర రాజకీయ, సాంస్కృతిక అణచివేతలో ఉన్నాయి. పశ్చిమ పాకిస్తాన్ సైన్యం తూర్పు ప్రాంత ప్రజలపై జరిపిన 'ఆపరేషన్ సెర్చ్‌లైట్' పేరుతో సాగిన మారణకాండ, అత్యాచారాలు, విధ్వంసం ప్రపంచాన్ని కదిలించాయి. ఈ దారుణాల నుండి తప్పించుకోవడానికి లక్షలాది మంది శరణార్థులు భారత్‌కు తరలివచ్చారు.**

మానవతా దృక్పథంతో, అలాగే దేశ అంతర్గత భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడటంతో, భారత్ ఈ విషయంలో జోక్యం చేసుకోవడం అనివార్యమైంది. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తీసుకున్న ధైర్యమైన నిర్ణయం, ఫీల్డ్ మార్షల్ శాం మానేక్షా నేతృత్వంలో భారత సైన్యం అమలు చేసిన అద్భుతమైన వ్యూహం ఈ విజయాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించాయి. 13 రోజుల పాటు సాగిన ఈ యుద్ధంలో భారత త్రివిధ దళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) సమన్వయంతో పనిచేశాయి. భారత నావికా దళం కరాచీ పోర్టుపై చేసిన మెరుపుదాడి (ఆపరేషన్ ట్రైడెంట్), పాకిస్తాన్ నౌకలను ముంచి, వారి సముద్ర మార్గాలను మూసివేయడం యుద్ధ గమనాన్ని మార్చింది. అదే సమయంలో, వైమానిక దళం శత్రు స్థావరాలపై ఆధిపత్యం చెలాయించింది. సైన్యం బంగ్లాదేశ్ భూభాగంలోకి వేగంగా చొచ్చుకుపోయి, ప్రధాన నగరాలను పట్టుకొని, తక్కువ సమయంలోనే రాజధాని ఢాకాను ముట్టడించింది. డిసెంబర్ 16న, లెఫ్టినెంట్ జనరల్ జగ్జిత్ సింగ్ అరోరా సమక్షంలో, పాకిస్తాన్ లెఫ్టినెంట్ జనరల్ ఏ.ఎ.కె.నియాజీ 93,000 మంది సైనికులతో లొంగిపోయారు. స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భావానికి, భారత సైనిక చరిత్రలో సువర్ణాధ్యాయానికి ఈ ఘట్టం నాంది పలికింది. ఈ అపురూప విజయం వెనుక వేలాదిమంది భారతీయ సైనికుల సాహసం, త్యాగం ఉన్నాయి. ఈ యుద్ధంలో ప్రాణాలు అర్పించిన వీరుల ధైర్యం, దేశం పట్ల వారి అచంచలమైన ప్రేమ ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకం. వారి వీర మరణం మన దేశ భద్రతకు, గౌరవానికి పునాదిగా నిలిచింది. విజయ్ దివస్ సందర్భంగా, అమర జవాన్ల పవిత్ర స్మృతికి మనమంతా శిరస్సు వంచి నమస్కరించాలి. నేడు, మన దేశం ఎన్నో సరిహద్దు సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, 1971 విజయ స్ఫూర్తితోనే ముందుకెళ్తోంది. సైనిక వ్యవస్థలో ఆధునికీకరణ, సాంకేతికత వినియోగం, పటిష్టమైన రక్షణ విధానాల రూపకల్పన.. ఇవన్నీ మన రక్షణ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి.

నేడు కక్షపూరిత ధోరణి

బంగ్లాదేశ్ రాజకీయాలు ప్రస్తుతం తీవ్ర గందరగోళంలో ఉన్నాయి. ఇటీవల ఏర్పడిన మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం (లేదా తాజా రాజకీయ శక్తులు) అనుసరిస్తున్న విదేశాంగ విధానం, ముఖ్యంగా భారతదేశం పట్ల చూపుతున్న కక్షపూరిత ధోరణి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు మనుగడ కోసం భారత్ అందించిన సహాయాన్ని, త్యాగాన్ని పూర్తిగా విస్మరించి, కేవలం అంతర్గత రాజకీయ ప్రయోజనాల కోసం భారతదేశ వ్యతిరేకతను పెంచుకోవడం ఆ దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరం. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో అధికారంలో ఉన్న రాజకీయ శక్తులు, 1971లో ఆ దేశం ఎలా ఆవిర్భవించిందనే కఠోర సత్యాన్ని మరుగున పడేయడానికి ప్రయత్నిస్తున్నాయి. 1971 విముక్తి యుద్ధంలో, భారత్ కేవలం పొరుగు దేశంగానే కాక, ప్రాణదాతగా నిలబడింది. తూర్పు పాకిస్తాన్‌లో అణచివేతకు గురవుతున్న ప్రజల కోసం భారత్ సైన్యాన్ని పంపింది. 93,000 మంది పాక్ సైనికులు లొంగిపోయేలా చేసి, బంగ్లాదేశ్ ఆవిర్భావానికి ప్రాణం పోసింది. లక్షలాది మంది బంగ్లాదేశీ శరణార్థులకు భారత్ ఆశ్రయం కల్పించింది. ఈ యుద్ధంలో వేలాది మంది భారతీయ సైనికులు తమ ప్రాణాలను అర్పించారు. ఒక దేశ విముక్తి కోసం మరొక దేశం ఇంత భారీ స్థాయిలో త్యాగం చేయడం చరిత్రలో అరుదు. ఈ చారిత్రక కృతజ్ఞతను విస్మరించి, నేడు అధికారంలో ఉన్నవారు భారత్‌పై నిందలు వేయడం, ద్వేషాన్ని పెంచడం అంటే బంగ్లాదేశ్ పునాదులనే కూల్చుకోవడానికి ప్రయత్నించడం అవుతుంది. ప్రస్తుత తాత్కాలిక పాలకవర్గం అనుసరిస్తున్న భారత్ వ్యతిరేక విధానం కేవలం రాజకీయ అపరిపక్వతను మాత్రమే కాదు, ప్రాంతీయ స్థిరత్వానికి విఘాతం కలిగించేలా ఉంది. బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ, ఆర్థిక సంక్షోభాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి భారత్‌ను బలిపశువుగా చూపించడం అత్యంత హేయమైన చర్య. భారత్‌పై వ్యతిరేకతను రెచ్చగొట్టడం ద్వారా తాత్కాలికంగా ప్రజాదరణ పొందవచ్చు, కానీ ఇది దీర్ఘకాలికంగా ఆ దేశ ప్రయోజనాలకే నష్టం చేస్తుంది. ఉగ్రవాదం, అక్రమ రవాణాపై పోరాడడంలో ఇరు దేశాలు బలమైన సహకారాన్ని కలిగి ఉన్నాయి. భారత్‌తో సంబంధాలు దెబ్బతింటే, ఈ సరిహద్దు ప్రాంతంలో భద్రతా సవాళ్లు మరింత పెరుగుతాయి. బిమ్స్‌టెక్, సార్క్ వంటి ప్రాంతీయ కూటముల్లో భారత్, బంగ్లాదేశ్ భాగస్వాములు. కీలకమైన సమయంలో భారత్‌తో విభేధాలు ప్రాంతీయ సహకారాన్ని, వృద్ధిని దెబ్బతీస్తాయి. భారతదేశాన్ని దూరం చేసుకోవడం అంటే, ప్రాంతీయ ఆధిపత్యం కోసం ఎదురుచూస్తున్న ఇతర శక్తులకు (ముఖ్యంగా చైనా) తలుపులు తెరిచినట్లే. ఇది బంగ్లాదేశ్ స్వయం ప్రతిపత్తికి మరింత హాని కలిగిస్తుంది. అంతర్జాతీయ సంబంధాలు కేవలం భావోద్వేగాల మీద మాత్రమే నడవవు అనేది వాస్తవమే. కానీ, బంగ్లాదేశ్ విషయంలో, భారత్‌తో ఉన్న చారిత్రక బంధం వారికి ఒక ఆస్తి వంటిది. నదీ జలాలు, సరిహద్దు వివాదాలు, వాణిజ్య అసమతుల్యత వంటి సమస్యలు ఉంటే వాటిని ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. కక్ష సాధింపులు, చారిత్రక ద్వేషాలు ఏ దేశానికి మంచి చేయలేవు. యూనస్ ప్రభుత్వం ఈ చారిత్రక సందర్భాన్ని, ఆ దేశ ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, నిస్వార్థ సాయం చేసిన భారత్ పట్ల ద్వేషాన్ని వీడి, నిర్మాణాత్మక సహకారం వైపు అడుగులు వేయాలి. లేదంటే, బంగ్లాదేశ్ తన విజయం మూలాలనే కోల్పోయి, భవిష్యత్తులో అస్థిరతకు గురయ్యే ప్రమాదం ఉంది.

**- గంగాధర్**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.